


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 223 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 23 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 223 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 23 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం..

## ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!

- లేబర్ పార్టీ నాయకత్వాన్నీ వీడుతున్నట్లు ప్రకటన
- సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి
- దేశ ప్రయోజనాల కోసమే నిర్ణయమని స్టార్మర్ వ్యాఖ్య
- 100 మందికిపైగా ఎంపీల నుంచి రాజీనామా డిమాండ్
- పదేళ్లలో బ్రిటన్‌కు ఏడో ప్రధాని మార్పు

పెన్ పవర్ డెస్క్:బ్రిటన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ (63) తన పదవికి, అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ

- మిగతా 2లో

# ప్రపంచంలోనే అతిపెద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ మనదే

## హైదరాబాద్ లో కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్

- క్యాన్సర్‌పై కేంద్ర ప్రభుత్వం సమగ్ర యుద్ధం ప్రకటించిందన్న అనుప్రియ పటేల్
- ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీనింగ్ కార్యక్రమం దేశంలో అమలు
- బసవతారకం ఆస్పత్రి సేవలను కొనియాడిన కేంద్ర మంత్రి
- ఆయుష్మాన్ భారత్ ద్వారా 62 కోట్ల మందికి క్యాన్సర్ చికిత్స భద్రత
- బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందిస్తున్నామన్న మంత్రి

పెన్ పవర్ డెస్క్:క్యాన్సర్ మహమ్మారిపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర యుద్ధం ప్రకటించిందని, ఇందులో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీనింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. హైదరాబాద్‌లోని బసవతారకం

- మిగతా 2లో




## డబ్బులేక ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు



పెన్ పవర్ డెస్క్: పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైందని ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రోజుకి 35 నుంచి 40 శస్త్రచికిత్సలు చేస్తున్నామని.. వేలాది మందికి ఇది ఓ ఆశాకిరణమని చెప్పారు.

- మిగతా 2లో

## లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి.. దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం
- ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారణ
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

పెన్ పవర్ డెస్క్:ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో

- మిగతా 2లో



## బసవతారకం ఆసుపత్రి ఆ స్ఫూర్తితోనే పనిచేస్తోంది

- బసవతారకం ఆసుపత్రి సేవలను కొనియాడిన వెంకయ్యనాయుడు
- మారుతున్న జీవనశైలి వల్లే క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని ఆందోళన
- విద్య, వైద్యం ఉచితంగా అందించడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సూచన
- క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రభుత్వాలు తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి
- బసవతారకం ఆసుపత్రి సేవలను అమరావతికి విస్తరించాలని కోరిక

- మిగతా 2లో





## హైదరాబాదులో బసవవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం.. హాజరైన సీఎం చంద్రబాబు

- హైదరాబాద్‌లో ఘనంగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- డబ్బు లేదనే కారణంతో ఏ రోగికి చికిత్స ఆగకూడదన్నదే లక్ష్యమన్న బాలకృష్ణ
- అమరావతిలోనూ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తున్నామని వెల్లడి
- ఇప్పటివరకు 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించినట్లు వివరణ

పెన్ పవర్ డెస్క్:హైదరాబాదులోని బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ (25వ వార్షికోత్సవ) వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఆసుపత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలకు అండగా నిలవాలనే గొప్ప లక్ష్యంతోనే ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఈ సభలో తాను నటుడిగానో, ఎమ్మెల్యేగానో కాకుండా ఒక కొడుకుగా మాట్లాడుతున్నానని బాలకృష్ణ భావోద్వేగంగా ప్రసంగించారు. తన తల్లి బసవతారకం గారు క్యాన్సర్‌తో బాధపడ్డారని, డబ్బు ఉన్నందున తాము పోరాడగలిగామని గుర్తు చేసుకున్నారు. “డబ్బు లేని పేదలు ఈ మహమ్మారి బారిన పడితే వారి పరిస్థితి ఏంటి?” అని తన తల్లి అడిగిన మాటే ఈ ఆసుపత్రి ఏర్పాటుకు స్ఫూర్తినిచ్చిందని వివరించారు. డబ్బు లేదనే కారణంతో ఏ ఒక్క క్యాన్సర్ రోగికి చికిత్స అందకుండా పోకూడదన్నదే తమ ధ్యేయమని బాలకృష్ణ పునరుద్ఘాటించారు. 25 ఏళ్ల క్రితం చేసిన ఈ ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నామని, భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం

- మిగతా 2లో

# కుట్రలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం.. అప్రమత్తంగా ఉండాలి

## చంద్రబాబుఅధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

- కొన్ని పార్టీలు ప్రతి అంశానికి కుల, మత రంగు పులుముతున్నాయని ఆరోపణ
- ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచన
- ఉద్యోగులు, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశం
- రాష్ట్రంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ప్రతి సంఘటనకు కుల, మత రంగు పులిమి, వివాదాస్పదం చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దుష్ప్రచారం, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. విద్వేషాలను రెచ్చగొట్టేలా సాగుతున్న తప్పుడు ప్రచారాలను, ఘటనలను అరికట్టేందుకు అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. ఇటీవల జరిగిన కొన్ని నేరాలకు మానసిక సమస్యలు, మరికొన్నింటికి గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం కారణమని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వం పాత కేసులను సైతం పరిష్కరిస్తోందని, 2019లో జరిగిన నేరాలను ఇప్పుడు గుర్తించి నిందితులను పట్టుకుని శిక్షలు పడేలా చేస్తున్నామని తెలిపారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరనే వాస్తవాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.
వాహనాల నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగానే నంబర్ ప్లేట్లు ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సాంకేతికత కీలకమని, ఈ నేపథ్యంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత, జల భద్రత, భూగర్భ జలాల రీఛార్జ్, నదుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)

- మిగతా 2లో



## 10 సూత్రాల అమలు.. సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం

- స్వర్ణాంధ్ర 2047 విజన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం
- ప్రణాళికా విభాగంతో కేఆర్ఈఏ వర్సిటీకి చెందిన ఐఎఫ్ఎంఆర్ ఎంఓయూ
- 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- జీరో పావర్టీ, వాటర్ సెక్యూరిటీ, డీప్ టెక్ మిషన్లపై తొలుత దృష్టి
- పది సూత్రాల అమలుకు రాష్ట్రస్థాయి కమిటీ, వర్కింగ్ గ్రూపుల ఏర్పాటు

- మిగతా 2లో




## స్థానికుల కోరిక మేరకు నచ్చిన దేవుడి మందిరాలు

పెన్ పవర్ డెస్క్:: గత ప్రభుత్వ హయాంలో విచ్ఛిన్నకర వాతావరణం ఉండేదని, దేవాలయాలకు సరైన ఆదరణ ఉండేది కాదని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సచివాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో దేవాదాయశాఖ రెండేళ్ల పనితీరుపై ఆయన రిపోర్టు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలు సమాజంలో భాగమని గత ప్రభుత్వం మరిచిపోయిందన్నారు.“ దేవాదాయశాఖ అభివృద్ధి, ప్రగతిని మీ ముందుంచుతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల నుంచి దేవాదాయ శాఖ ప్రక్షాళన ప్రారంభించింది.

- మిగతా 2లో

## పవన్ కల్యాణ్ మాటలకు నా పీఏ కూడా స్పందించడు

- పవన్ హావభావాలపై సోషల్ మీడియాలో విపరీతంగా మీమ్స్ వస్తున్నాయన్న శ్రవణ్ కుమార్
- సినిమాల్లో కంటే నిజ జీవితంలో అద్భుతంగా నటిస్తున్నారని వ్యాఖ్య
- సుగాలి ప్రీతి కేసులో పవన్ మాట మార్చారని విమర్శ

- మిగతా 2లో



టెకీ రాధా గాయత్రి కేసులో కీలక పరిణామం..

## విచారణాధికారి మార్పు

పెన్ పవర్ డెస్క్: ఉత్తరాఖండ్‌లోని మసూరీలో అనుమానాస్పదరీతిలో మృతి చెందిన టెకీ రాధా గాయత్రి కేసు )లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు విచారణాధికారిని అక్కడి డీజీపీ దీపమ్‌సేథ్ మార్పు చేశారు. మసూరీ ఎస్‌హెచ్‌వో దేవేంద్ర చౌహాన్ ప్రవర్తనపై మృతురాలి తండ్రి సుధాకర్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎస్‌హెచ్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణ నుంచి తప్పించారు.

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### పిఠాపురం రాజకీయ కాక !

పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అని 2024 ఎన్నికల ముందూ తరువాత ఏపీ అంతా ఊగేలా స్లోగన్స్ చేసింది జనసైన్యం. పిఠాపురం అలా ఏపీ ఆంతా హాట్ టాపిక్ తొలిసారి అయింది. ఆ క్రెడిట్ కచ్చితంగా పవన్ కళ్యాణ్ దే. ఎందుకంటే ఆయన వెండితెర మీద పవర్ స్టార్. ఆయన ఫాలోయింగ్ అన్నది ఊహాతీతం. ఆయన క్రేజ్ అన్నది అద్భుతం. అందుకే పిఠాపురం అన్న ఒక అసెంబ్లీ నియోజకవర్గం టాక్ ఆఫ్ ది స్టేట్ అయింది. అది పవన్ అక్కడ నుంచి పోటీ చేయాలని ఎంచుకుని నిలిచి గెలిచిన తరువాత జరిగిన డెవలప్మెంట్స్ గానే వీటిని చూడాల్సి ఉంది.

**పొలికేక గా మారింది :**

పిఠాపురం నుంచి పవన్ పోటీ చేసి గెలిచారు. ఆయన ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఇక రెండేళ్ళ కూటమి పాలనలో కాపులకు న్యాయం జరగడం లేదని వైసీపీ కాపులంతా ఒక చోట చేరి మీటింగ్ పెట్టారు. అది కోనసీమ జిల్లా వేదికగా జరిగింది. ఈ మీటింగ్ తరువాత రాజకీయ ప్రకంపనలు ఒక రేంజిలో సాగుతున్నాయి. జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు అన్నట్లుగా రాజకీయం రంజుగా సాగుతోంది. ఈ మీటింగ్ తరువాత వైసీపీ నాయకురాలు వంగా గీత మీడియాతో మాట్లాడుతూ ఒక కామెంట్ చేశారు. పవన్ కులాన్ని తక్కువ చేయకూడదని అన్నారు. కాపులు ఎక్కువగా ఉన్నారనే కదా పిఠాపురం ఎంచుకుని పోటీ చేశారు అని ఆమె కామెంట్స్ చేశారు. అదే ఇపుడు ఏపీలో రాజకీయ పొలికేక గా మారిపోయింది.

**పంతం నానాజీ ఫైర్ :**

మరో వైపు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే జనసేన నేత పంతం నానాజీ అయితే హాట్ కామెంట్స్ చేశారు. పవన్ పిఠాపురం నుంచి పోటీ చేస్తే తప్పేంటి అన్నారు. వంగా గీతది పిఠాపురం అమ్మ గారి ఊరా నాన్న గారి ఊరా అని ప్రశ్నించారు. అసలు ఎవరు ఎక్కడ నుంచి అయినా పోటీ చేయవచ్చు అని రాజ్యాంగంలో ఉందని అన్నారు. జగన్ పులివెందుల నుంచి బయటకు వచ్చి కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ సత్తా ఏమిటో చూపిస్తామని పంతం నానాజీ రాజకీయ పంతమే పూనారు. ఈ సందర్భంగా ఆయన ఆవేశంలో జగన్ మీద అనుచిత వ్యాఖ్యలే చేశారు.

**భగ్గుమన్న వైసీపీ :**

పంతం నానాజీ వ్యాఖ్యలతో వైసీపీ నేతలు అంతా భగ్గుమంటున్నారు. పంతం నానాజీ మీద 2024 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలు అయిన మాజీ మంత్రి కురసాల కన్నబాబు జగన్ వంటి నేత మీద మాజీ సీఎం మీద పంతం నానాజీ దారుణమైన కామెంట్స్ చేస్తున్నారు అని మండిపడ్డారు. జనసేన తమతో సవాల్ చేసే ముందు ఒంటరిగా పోటీకి దిగాలని ఆయన అన్నారు. పొత్తులతో వచ్చి గెలవడం కాదని ఎద్దేవా చేశారు. పదిహేనేళ్ల పాటు కూటమి పొత్తులో ఉంటామని జనసేన చెప్పడమే జగన్ అంటే భయం ఏంటో తెలియచేస్తోందని మళ్లీ సవాళ్ళు ఎందుకని ఆయన ప్రశ్నించారు.

**నా మరణం పిఠాపురం గడ్డ మీదనే :**

ఇక వంగా గీత అయితే భావోద్వేగంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. తన పుట్టింటి వారు అంతా ఉండేది పిఠాపురంలోనే అని చెప్పారు. తనది నాలుగు దశాబ్దాల సుదీర్ఘమైన రాజకీయం అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ గా పనిచేశాను అని అలాగే ఎంపీగా ఎమ్మెల్యేగా నెగ్గిన తనను జగన్ పిలిచి కాకినాడ ఎంపీగా పోటీ చేయించారని గుర్తు చేసుకున్నారు. తన మరణం కూడా పిఠాపురంలోనే అని పిఠాపురంతో తన అనుబంధాన్ని ఎవరూ ప్రశ్నించజాలరని ఆమె ఎమోషనల్ గా కామెంట్స్ చేశారు. మొత్తం మీద చూస్తే పిఠాపురం చుట్టూ రాజకీయ కాక అంటుకుంది. మరి ఇది ఏ మలుపు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

## 10 సూత్రాల అమలు.. సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం

ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన 'స్వర్ణాంధ్ర 2047 విజన్' అమలులో ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా నిర్దేశించిన పది సూత్రాలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రణాళికా విభాగం, కేఆర్ఈఏ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్ (ఐఎఫ్ఎంఆర్) మధ్య సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరిగింది. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధి కపిల్ విశ్వనాథన్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో 15 శాతం వృద్ధిరేటును సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. 2014-19 మధ్య కాలంలో 13.5 శాతం సగటు వార్షిక వృద్ధి రేటును (సీఏజీఆర్) సాధించామని, అయితే గత ఐదేళ్లలో వివిధ కారణాల వల్ల అది 11 శాతానికి పరిమితమైందని విశ్లేషించారు. ఇప్పుడు నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ), వృద్ధిరేటు సాధనలో పది సూత్రాల మిషన్ సెల్స్‌ను ఏర్పాటు చేసి, వాటి పర్యవేక్షణ బాధ్యతలను ఐఎఫ్ఎంఆర్ చూస్తుంది. తొలిదశలో జీరో పావర్టీ (పేదరిక నిర్మూలన), వాటర్ సెక్యూరిటీ (జల భద్రత), డీప్ టెక్నాలజీ మిషన్లపై ఐఎఫ్ఎంఆర్ ప్రభుత్వంతో కలిసి పనిచేయనుంది. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, విధానపరమైన సూచనలు అందించడంతో పాటు, వినూత్న పద్ధతులను సిఫారసు చేస్తుంది. ఈ పది సూత్రాల అమలును పర్యవేక్షించేందుకు ప్రభుత్వం రాష్ట్రస్థాయి కమిటీతో పాటు, మిషన్ వర్కింగ్ గ్రూపులను కూడా ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలోని అన్ని రంగాల అభివృద్ధికి డీప్ టెక్‌ను అనుసంధానం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఏఐ స్కిల్లింగ్, డ్రోన్ మ్యాపింగ్, ఆటోమొబైల్, మెటల్స్, స్టీల్, సెమీ కండక్టర్స్, రక్షణ రంగాల్లో కీలక ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తున్నాయని గుర్తుచేశారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీలను సైతం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కేఆర్ఈఏ, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధులు, ప్రణాళికా విభాగం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ మనదే

- మొదటి పేజీ తరువాయి

ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ రజతోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అనుప్రియ పటేల్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 1.84 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ల (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) ద్వారా 30 ఏళ్లు దాటిన వారికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు 35 కోట్ల మందికి ఓరల్ క్యాన్సర్, 16 కోట్ల మంది మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, 9 కోట్ల మందికి సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పూర్తి చేశామని పేర్కొన్నారు. ముందస్తుగా వ్యాధిని గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చని, చికిత్సా భారాన్ని తగ్గించవచ్చని ఆమె అన్నారు. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన మౌలిక సదుపాయాలను భారీగా పెంచామని, 2014కు ముందు 384గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్య ఇప్పుడు 820కి చేరిందని తెలిపారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కింద 62 కోట్ల మంది పేదలకు క్యాన్సర్ చికిత్సలో ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. జన్ ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరకే మందులు అందిస్తున్నామని గుర్తుచేశారు. నివారణ చర్యల్లో భాగంగా 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. స్వర్గీయ ఎన్టీ రామారావు దార్శనికతతో, బసవతారకం గారి స్ఫూర్తితో ఏర్పాటైన ఈ ఆసుపత్రి, గత 25 ఏళ్లుగా పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆసుపత్రి చేస్తున్న సేవలను కొనియాడారు. అమరావతిలో కొత్తగా ఏర్పాటు చేయబోయే ఆసుపత్రికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## బసవతారకం ఆసుపత్రి ఆ స్ఫూర్తితోనే పనిచేస్తోంది

బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సేవలు మహోన్నతమైనవని, స్వర్గీయ నందమూరి తారక రామారావు, బసవతారకం గార్ల స్ఫూర్తితో ఏర్పాటైన ఈ సంస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రశంసించారు. అయితే, మారుతున్న జీవనశైలి కారణంగా దేశవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి ఒక 'రాచపుండు'లా విస్తరిస్తోందని, దీనిని ఎదుర్కోవడానికి ఒక జాతీయ మిషన్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఒక కర్తవ్యంగా చేపట్టాలని ఆయన సూచించారు.

బసవతారకం ఆసుపత్రి రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్న వెంకయ్యనాయుడు తన ప్రసంగంలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. స్వర్గీయ ఎన్టీఆర్ తన భార్య బసవతారకం గారి కోరిక, ప్రేరణతో ఈ ఆసుపత్రిని స్థాపించి గొప్ప ఆశయానికి పునాది వేశారని, వారి స్మృతికి నివాళులర్పించారు. ప్రస్తుతం ఆసుపత్రి చైర్మన్‌గా నందమూరి బాలకృష్ణ, ఆయన కుమార్తె బ్రహ్మణి నాయకత్వంలో ఆసుపత్రి మరింత ఉన్నతంగా సేవలందించడం అభినందనీయమని అన్నారు. ఈ సేవలను ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కూడా విస్తరించి, మరింత మందికి అందుబాటులోకి తేవాలని ఆయన ఆకాంక్షించారు.

**జీవనశైలి మార్పులే ప్రధాన కారణం**

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగానే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు పెరుగుతున్నాయని వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. "మన జీవితంలో, జీవన శైలిలో వస్తున్న మార్పుల కారణంగానే ఈ రాచపుండు విజృంభిస్తోంది. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. క్యాన్సర్ అనే పదం బదులు 'రాచపుండు' అనే స్వచ్ఛమైన తెలుగు పదాన్ని వాడటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అమెరికాలో ఉంటూ కూడా అద్భుతమైన తెలుగు భాషా పరిజ్ఞానంతో మాట్లాడిన మంత్రి చంద్రశేఖర్ గారిని చూసి ఎంతో మురిసిపోయానని అన్నారు.

**వైద్యం ఒక పవిత్రమైన మిషన్**

వైద్యం, విద్య అనేవి వ్యాపారాలుగా కాకుండా ఒక మిషనరీ స్ఫూర్తితో సాగాలని వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. బసవతారకం ఆసుపత్రిలోని వైద్య బృందం డాక్టర్ ప్రభాకర్ రావు, డాక్టర్ సోమసుందర్ రావు, డాక్టర్ కృష్ణయ్య వంటి వారు రోగులకు ప్రేమపూర్వకంగా, అంకితభావంతో సేవలు అందిస్తున్నారని, అందుకే ఆ ఆసుపత్రి విజయవంతంగా నడుస్తోందని కొనియాడారు. తాను కూడా అప్పుడప్పుడు తెలిసిన రోగుల కోసం ఆసుపత్రికి వెళ్తుంటానని గుర్తు చేసుకున్నారు.

**ఉచితాలపై కీలక వ్యాఖ్యలు.. ప్రభుత్వాలకు సూచనలు**

ప్రభుత్వాలు విచక్షణారహితంగా ఉచితాలు పంచడం తగదని, అవి అరుచితాలుగా మారతాయని వెంకయ్యనాయుడు పునరుద్ఘాటించారు. "నేను ఎప్పుడూ చెబుతుంటాను, ఉచితాలు వద్దయ్యా అవి అరుచితాలు అయిపోతాయి. కానీ విద్య, వైద్యం ఈ రెండింటినీ ఉచితంగా ఇవ్వండి. సామాన్య ప్రజలు ఎంతో లాభపడతారు" అని ఆయన స్పష్టం చేశారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వాలు ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అత్యాధునిక పరిజ్ఞానంతో వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు.

## లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి.. దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- మొదటి పేజీ తరువాయి

ఉన్న ఓ మూడు అంతస్తుల భవనంలోని కోచింగ్ సెంటర్‌లో చెలరేగిన మంటల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, పురానియాలోని ఓ వాణిజ్య భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే దట్టమైన పొగ భవనం మొత్తాన్ని చుట్టుముట్టడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పై అంతస్తుల నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారంతా 20 నుంచి 24 ఏళ్లలోపు వయసు వారేనని అధికారులు తెలిపారు. ఈ ప్రమాద వార్త తెలియగానే ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, అలీగఢ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని లక్నోకు తిరిగి వచ్చారు.

ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. భవనం గోడలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## పవన్ కల్యాణ్ మాటలకు నా పీఏ కూడా స్పందించడు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ... పవన్ కల్యాణ్ హావభావాలు, ఆయన మాట్లాడుతున్న విధానంపై సోషల్ మీడియాలో విపరీతంగా మీమ్స్, ట్రోల్స్ వస్తున్నాయని ఎద్దేవా చేశారు. "ఈ శతాబ్దపు మోస్ట్ కామిక్ పర్సన్ పవన్ కల్యాణ్. ఆయన సినిమాల్లో కంటే నిజ జీవితంలోనే అత్యంత అద్భుతంగా నటిస్తున్నారు. పదిమందిలో మాట్లాడుతున్నామనే కనీస బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. ఆయన ఉప ముఖ్యమంత్రి కాకుండా ఉంటే, ప్రెస్ మీట్లో ఆయన మాటలకు నా పీఏ కూడా స్పందించడు. అసలు ఆయన వెంట ఒక సామాజిక వర్గం కళ్లు మూసుకుని ఎలా నడుస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత రాజకీయాలను ప్రస్తావిస్తూ... 2019 వరకు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, మరి దానిపై పవన్ కల్యాణ్ ఎందుకు నోరు మెదపరని శ్రవణ్ కుమార్ నిలదీశారు. ముఖ్యంగా సంచలనం రేపిన 'సుగాలి ప్రీతి' కేసును పవన్ డీల్ చేస్తున్న తీరుపై ఆయన లీగల్ పాయింట్స్ లేవనెత్తారు. "సుగాలి ప్రీతి అసలు ఏ సంవత్సరంలో చనిపోయిందో కూడా కనీస అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నారు. గతంలో ఈ కేసు విషయంలో 'భౌభౌ'మని అరిచిన పవన్.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మారుస్తున్నారు" అని మండిపడ్డారు. సుగాలి ప్రీతి కేసులో పోలీసులు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో అన్ని రకాల పక్కా ఆధారాలు ఉన్నాయని, కానీ పవన్ కల్యాణ్ మాత్రం ఆధారాలు లేవని అనడం వెనుక అసలు ఉద్దేశం ఏంటని శ్రవణ్ కుమార్ ప్రశ్నించారు. "కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలన్నీ కోర్టులో అత్యంత భద్రంగా ఉన్నాయి. అలాంటప్పుడు ఆధారాలు లేవంటూ నిందితులను కేసు నుంచి తప్పించాలని పవన్ చూస్తున్నారా?" అంటూ సూటిగా ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ అజ్ఞానాన్ని చూసి జనసేన నేతలు, కార్యకర్తలు తరించాలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం.. ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!

- మొదటి పేజీ తరువాయి

నుంచే పెరిగిన ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని చెప్పారు. "నేను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నాను" అని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పలు రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, వేతనాల పెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల, కార్మికులు-అద్దెదారుల హక్కుల బలోపేతం వంటి అంశాలను ప్రస్తావించారు. రక్షణ వ్యయాన్ని పెంచడం, అక్రమ వలసలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం, చిన్నారుల పేదరికం తగ్గించే కార్యక్రమాలు అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన విజయాలని పేర్కొన్నారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం దేశ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక సవాళ్లు, అక్రమ వలసల వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు బ్రిటన్‌లో పెరుగుతున్నాయి.

## హైదరాబాదులో బసవవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం..

- మొదటి పేజీ తరువాయి

ఆసుపత్రిలో రోజుకు 35 నుంచి 40 సర్జరీలు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించామని తెలిపారు. దేశంలోనే తొలి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాల్లో తమది ఒకటని గర్వంగా చెప్పారు.

భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోనూ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించనున్నట్లు బాలకృష్ణ ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రి సేవలను కూడా మరింత విస్తరిస్తామని వెల్లడించారు. ఈ వేడుకలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనరసింహ, ఏపీ మంత్రి సత్యకుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## కుట్రలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం.. అప్రమత్తంగా ఉండాలి

- మొదటి పేజీ తరువాయి

కింద వచ్చే అర్జీలను సానుభూతితో పరిశీలించాలన్నారు. "సమస్య పరిష్కారం కోసం తమ దగ్గరకు వచ్చే పౌరులతో అధికారులు, ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తించాలి. వారి స్థానంలో మనమే ఉంటే ఎలా ఆలోచిస్తామో అలా ఆలోచించి సేవలు అందించాలి. ఇది పరిపాలనపై ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది" అని ఆయన హితవు పలికారు.

ఉద్యోగుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తామని, పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని తేల్చిచెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారానే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుందని, మంత్రులు, అధికారులు, ఉద్యోగులు దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఫైళ్ల క్లియరెన్స్ సులభమైందని, అయితే వినూత్న ఆలోచనలు లేకపోతే వ్యవస్థలు నిస్సారంగా మారతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డబ్బులేక ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు

- మొదటి పేజీ తరువాయి

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. "నటుడిగా, ఎమ్మెల్యేగా కాదు.. ఓ కొడుకుగా మీ ముందు నిలుచున్నా. మా అమ్మ బసవతారకం క్యాన్సర్ బారిన పడినప్పుడు ఎంతో బాధపడ్డాం. డబ్బు ఉంది కాబట్టి గట్టిగా పోరాడగలిగాం. డబ్బు లేని వారు ఈ వ్యాధితో ఎలా పోరాడుతారని మా అమ్మ ప్రశ్నించారు. అప్పుడే ఈ ట్రస్ట్ ఏర్పాటు ఆలోచన వచ్చింది. 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించాం. బాధతో ఆసుపత్రికి వచ్చే వారు నవ్వుతూ తిరిగి వెళ్లాలి అనేదే మా ఉద్దేశం. భారత్‌లోనే మొట్టమొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రం అప్పట్లో ప్రారంభించాం.

ప్రభుత్వాలు మాకు ఎంతగానో సహకరించాయి. ఎన్నో సంస్థలు, ఎందరో దాతలు ఈ ప్రయాణంలో మాకు అండగా నిలిచారు. ఏ ఒక్క రోగి కూడా డబ్బు లేక క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు. 25 ఏళ్ల క్రితం చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నాం.. భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తాం. హైదరాబాద్‌లో సేవలు మరింత విస్తరిస్తాం" అని బాలకృష్ణ అన్నారు.

## టెకీ రాధా గాయత్రి కేసులో కీలక పరిణామం.. విచారణాధికారి మార్పు

- మొదటి పేజీ తరువాయి

అనంతరం ఆ బాధ్యతను సంపూర్ణానంద్ గైరోలాకు అప్పగించారు. అల్లుడు శ్రీచరణ్‌పై అనుమానాలతో సుధాకర్ మసూరీ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో శ్రీచరణ్‌పై హత్య కేసు నమోదైంది.

## స్థానికుల కోరిక మేరకు నచ్చిన దేవుడి మందిరాలు

- మొదటి పేజీ తరువాయి

పవిత్ర స్థలాలు సామన్యులకు అందుబాటులో ఉంచే చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతి ఇంటికీ ఆధ్యాత్మికత చేర్చాలన్న సీఎం ఆదేశాలతో పని చేస్తున్నాం. రెండేళ్లుగా హిందువుల ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక విలువలు కాపాడుతున్నాం. ఆరు వేలకు పైగా ఆలయాల పునర్నిర్మాణానికి రూ.813 కోట్లు వెచ్చించాం. ధార్మిక పరిషత్ ద్వారా శ్రీవాణి నిధులతో 1200కు పైగా భజన మందిరాలు నిర్మించాం. స్థానిక ప్రజల కోరిక మేరకు నచ్చిన దేవుడి మందిరాలు నిర్మిస్తాం. దేవాదాయ భూ రికార్డులను డిజిటలైజ్ చేసి పరిరక్షణ బాధ్యతలు చేపట్టాం. రానున్న రోజుల్లో 65 ఆలయాల్లో అన్నప్రసాదానికి చర్యలు తీసుకుంటున్నాం. అన్నప్రసాదం కోసం ఏటా దేవాదాయశాఖ రూ.84 కోట్లు ఖర్చు చేస్తోంది." అని మంత్రి ఆనం వివరించారు.

# రైతులకు ఎరువుల పంపిణీపై అవగాహన



**తాళ్ళపూడి, పెన్ పవర్, జూన్ 22**:మండలంలోని వేగేశ్వరపురం-2 రైతు సేవా కేంద్రంను జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో నూతన ఎరువుల పంపిణీ విధానం గురించి అవగాహన కల్పించటం జరిగింది. సాగు చేసే ప్రతీ రైతుకు ఏపిఏఐఎంఎస్ పోర్టల్ ద్వారా వారు సాగు చేసే పంట విస్తీర్ణంను బట్టి నిర్దేశించిన మోతాదులో యూరియా, డి.ఎ.పి ఎరువులను రైతులకు ఇవ్వటం జరుగుతుంది అని, ఎరువుల సరఫరాలో రైతులు ఏవిధమైన ఆందోళన చెందనవసరం లేదు అని తెలిపారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో వరికి బదులు అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్ వంటి ఉద్యాన పంటలు సాగు చేయటం వల్ల రైతులకు ఆదాయం పెరుగుతుంది అని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉన్నందున రైతులు నీటి వినియోగం తక్కువ అవసరం అయ్యే పంటలను సాగు చేసుకోవల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రుచిత, రైతులు పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# పీజీఆర్ఎస్‌లో 186 అర్జీల స్వీకరణ



- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం
- కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 22**:ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. అదేవిధంగా ప్రతి నాలుగు వారాలకు ఒక నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువవుతున్నామని పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.భాస్కర్ రెడ్డి, సీపీఓ ఎల్.అప్పలకొండ, జిల్లా అభివృద్ధి అధికారి కె.రత్న కుమారి, ఇతర జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 186 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మరింత జవాబుదారీతనంతో సేవలు అందించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలతో పాటు నియోజకవర్గ స్థాయిలో కూడా పీజీఆర్ఎస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు 1100 టోల్ ఫ్రీ నంబర్, మీ సేవ కేంద్రాలు, అలాగే ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా కూడా తమ ఫిర్యాదులు, వినతులను నమోదు చేసుకోవచ్చని, అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు పంపించి నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలే ఉంటున్న నేపథ్యంలో, వాటి పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. భూ సమస్యలు, పట్టాదారు పాస్‌బుక్స్, వారసత్వం, సర్వే తదితర రెవెన్యూ అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు ఆర్.శివ రాముడు, కె.ఆనంద రావు, ఎస్డిసి కె.భాగ్యలక్ష్మి, ఎమ్.ఆర్.ఆర్.ప్రేమ్ కుమార్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూ పోరాట కమిటీకి రాసిచ్చిన ఒప్పంద హామీ పత్రానికి కట్టుబడి ఉండాలి...



**కూనవరం,పెన్ పవర్,జూన్ 22**.స్థానికంగా ఉన్న రైతులు తమ సాగు భూమిని వారే సాగు చేసుకోవాలి తప్ప బినామీ పేర్లతో ప్రభుత్వానికి త్యాగం చేసిన ప్రభుత్వ భూమి లీజుకు ఇచ్చిన పక్షంలో భూ పోరాట కమిటీకి తెలిసిన వెంటనే అటువంటి వారిపై కఠినమైన ఎల్ టి ఆర్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని భూ పోరాట కమిటీ ప్రకటన ద్వారా హెచ్చరించారు.మండలంలోని స్థానిక రైతులు భూపోరాట కమిటీకి రాసిచ్చిన ఒప్పంద హామీ పత్రానికి అందరూ కట్టుబడి ఉండాలని అన్నారు.భూ పోరాట కమిటీలో నిర్ణయించిన నిర్ణయాల్లో స్థానికంగా ఉండే రైతులు వారి భూమిని వారే సాగు చేసుకోవాలని గతంలో ఇచ్చిన ఒప్పంద హామీ పత్రాన్ని యధావిధిగా అమ్ములు పరచాలని, ఇచ్చిన హామీకి గిరిజనేతర సాగుభూమి రైతులు,భూ పోరాట కమిటీ రైతులు కట్టుబడి ఉండాలని అన్నారు.అదేవిధంగా స్థానికంగా లేనటువంటి రైతుల భూములు ప్రభుత్వ భూమిగా లెక్కలోకి వస్తుంది కనుక అట్టి భూమిని పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే వరకు మండలంలోని గిరిజనులకు వ్యవసాయం సాగు చేసే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అటువంటి భూమిపై మండలంలోని గిరిజనులందరూ ఆహ్వానితులేనని భూపోరాట కమిటీ పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో కట్టి శ్రీను,కట్టి తమ్మయ్య,కుంజ వెంకట్రావు,కుంజ శ్రీను,తెల్లం తమ్మయ్య,ఉయిక కన్నయ్య, పొడియం అప్పారావు,సోడే శ్రీరాములు,తొండా లక్ష్మయ్య,బొడ్డు జోగారావు,కట్టి చంద్రయ్య,మోసం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు భూగర్భ జలాల నిర్వహణ, రీఛార్జ్ పద్ధతులు పై శిక్షణ కార్యక్రమం

**ఏలూరు, జూన్, 22 పెన్ పవర్ :** ఏలూరు జిల్లాలో లోతైన భూగర్భ జల మట్టాలు గల ప్రాంతములో సుస్థిరమైన భూగర్భ జలాల నిర్వహణ మరియు రీఛార్జ్ పద్ధతులు అనే అంశం పైన ఏలూరులో ఒకరోజు శిక్షణ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా గ్రౌండ్ వాటర్ అండ్ వాటర్ ఆడిట్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ పి . కోదండరావు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని రాజీవ్ గాంధీ నేషనల్ గ్రౌండ్ వాటర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్,రాయపూర్ తరుపున కేంద్రీయ భూగర్భ జల బోర్డు నిర్వహిస్తారన్నారు. ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ లోని గోదావరి మీటింగ్ హాల్ లో శిక్షణా కార్యక్రమం జరుగుతుందని, కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. దక్షిణ క్షేత్రము సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ప్రాంతీయ సంచాలకులు ఎన్.జ్యోతి కుమార్,సి జి డబ్ల్యు జి ఆంధ్రప్రదేశ్ స్టేట్ యూనిట్ ఆఫీస్ సైంటిస్ట్-సి,ఆఫీసర్ ఇన్ ఛార్జ్ డాక్టర్.సుచేతన బిస్వాస్,గ్రౌండ్ వాటర్ ఆడిట్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ కే.శాస్త్రి, జాయింట్ డైరెక్టర్ ఎన్. శ్రీనివాస్, వ్యవసాయ,
ఉద్యానవనాలు, డ్వామా,మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్,అధికారులు పాల్గొంటారన్నారు. ఏలూరు జిల్లాలో భూగర్భ జల వనరులు, హైడ్రోలాజికాల్ వ్యవస్థల గురించి అవగాహనా, భూగర్భజలాల అభివృద్ధి, నిర్వహణ,వాన నీటి సంచయనము, వ్యర్థ జలాల రీసైక్లింగ్ అండ్ రీయూజ్ తదితర అంశాలపైనా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. డిపార్ట్మెంట్ అఫ్ అగ్రికల్చర్, భూగర్భ జల శాఖ డిపార్ట్మెంట్ అఫ్ హార్టికల్చర్ మరియు తదితర జిల్లా శాఖల నుండి అభ్యర్థులు ఈ శిక్షణ కార్యక్రమం లో పాల్గొంటారన్నారు.

# ప్రభుత్వ కొళాయి వద్ద మురుగు నీటి గుంత

చలనం లేని స్వర్ణ గ్రామ సిబ్బంది

**వై రామవరం, పెన్ పవర్,జూన్ 22 :** ప్రభుత్వ కుళాయి ద్వారా లీకైన నీరు మురుగు నీటి గుంతగా ఏర్పడి దుర్గంధం వెదజల్లుతున్న స్వర్ణ గ్రామ సిబ్బంది లో చలనం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
వివరాల్లోనికి వెళితే మండలంలోని చవిటి దిబ్బలు పంచాయతీ తోటకూర పాలెం గ్రామంలో గతంలో ఉన్న సచివాలయం చెంతనే ఉన్న కొళాయి నుండి నీరు లీక్ అవుతుందని దీనివల్ల బురదగా ఏర్పడి దుర్గంధం వెదజల్లుతూ దోమలు నిలయాలుగా మారాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వేసవికాలంలోనే ఇలా ఉండేదని, ప్రస్తుతం వర్షాలు ప్రారంభం అయ్యాయని, ఈ మురుగు నీటి గుంతలలో దోమలు ప్రజలే ప్రమాదం ఉందని, వాటి వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, వైరల్ ఫీవర్లు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఈ మురుగు నీటి గుంతలో బ్లీచింగ్ కానీ, యాంటీ లార్వా మందులను గాని స్ప్రే చేసిన దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో దోమలు విపరీతంగా పెరిగిపోయాయని అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీ కొళాయి వద్ద మురుగు నీరు నిలువ ఉండకుండా అదేవిధంగా దోమలు, జ్వరాలు వ్యాప్తి కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుచున్నారు.



# జూన్ 30న మెగా జాబ్ మేళా



- 16 కంపెనీలతో ఉద్యోగ అవకాశాలు
- కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 22** :పోలవరం జిల్లాలోని చదువుకున్న యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 30న మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.సోమవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఆర్డీఓ కె. స్వాతి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పదో తరగతి మరియు అంతకంటే పై స్థాయి విద్యార్హతలు కలిగిన యువతీ యువకుల కోసం నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 16 ప్రముఖ కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం జూన్ 30న ఉదయం 10 గంటలకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాంగణంలో జరగనుందని చెప్పారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు శినైపుణ్యం పోర్టల్‌రిద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. జాబ్ మేళా రోజున సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు.మరిన్ని వివరాల కోసం 6304634447 నంబర్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ మరియు నైపుణ్యాభివృద్ధి అధికారి నిరుపమతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# స్పందన







పెన్ పవర్ ఎఫెక్ట్

**ఏలూరు జూన్ 22 10 పవర్ :** పెదపాడు మండలం కలపర్రు గ్రామంలో మండల పరిషత్ పాఠశాల వెనుక ఉన్న కచ్చా డ్రైన్ లో పారిశుధ్యం పై ఈనెల 21న పెన్ పవర్ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు పెదపాడు మండలం డిప్యూటీ ఎంపీడీవో స్పందించారు. పాఠశాల వెనుక డ్రైనేజీలో పారిశుద్ధ్యన్ని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో, పంచాయతీ కార్యదర్శి అంజనాదేవి శుభ్రపరచి బ్లీచింగ్ వెదజలించారు. డ్రైనేజీ నిర్మాణ విషయం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో చేర్చి, నేతల సహకారంతో డ్రైనేజీ నిర్మాణానికి కృషి చేస్తామని, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

# చెలకవీధి రహదారులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం

✷ గ్రామస్తులకు కలెక్టర్ కె. దినేష్ కుమార్ హామీ



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 22 :**రంపచోడవరం మండలం వేములకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని చెలకవీధి గ్రామ రహదారుల సమస్యను స్వయంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ హామీ ఇచ్చారు.సోమవారం చెలకవీధి గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సీమగండి--కాకవాడ మధ్య 5 కిలోమీటర్ల కొత్త బీటీ రహదారి, కాకవాడ--చెలకవీధి--వేములకొండ మధ్య 4 కిలోమీటర్ల బీటీ రహదారి మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం ఈ రహదారులు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కలెక్టర్

దృష్టికి తీసుకువచ్చారు.వినతిపత్రాన్ని స్వీకరించిన కలెక్టర్ దినేష్ కుమార్ స్పందిస్తూ, గ్రామానికి స్వయంగా వచ్చి రహదారుల పరిస్థితిని పరిశీలిస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు.కలెక్టర్ హామీతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రాంత రహదారుల సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సేవలపై రాజీ లేదు



✷ శాఖల పనితీరును నిరంతరం సమీక్షించి మెరుగైన ఫలితాలు సాధించాలి
✷ జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 22 :**జిల్లాలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు ప్రతి 15 రోజులకోసారి అన్ని శాఖల పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తున్నామని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ప్రజా సేవల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, ఆర్డీవో కె. స్వాతితో కలిసి వివిధ శాఖల పబ్లిక్ పర్‌ఫార్మెన్స్ నివేదికలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి శాఖ పనితీరును ప్రజల అభిప్రాయాల ఆధారంగా అంచనా వేస్తోందని, అందుకు సంబంధించిన నివేదికలను జిల్లా యంత్రాంగానికి పంపుతోందన్నారు.రేషన్ పంపిణీ, రహదారుల గుంతల పూడ్చివేత, దీపం పథకం అమలు, పౌర సరఫరాలు, గిరిజన సంక్షేమం తదితర శాఖల పనితీరుపై వచ్చిన ఫిర్యాదులు, ప్రజల అభిప్రాయాలను సమావేశంలో సమీక్షించారు. గత నెలలో పలు శాఖలు మంచి పనితీరు కనబరిచినప్పటికీ, అదే స్థాయిలో సేవలు కొనసాగించాలని అధికారులకు సూచించారు.పనితీరులో లోపాలు ఉన్న శాఖలు వెంటనే వాటిని సరిదిద్దుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమ శాఖ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని పేర్కొంటూ, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.రేషన్ పంపిణీ, పౌర సరఫరాల శాఖ, దీపం పథకం అమలుపై వచ్చిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో త్వరలో ముఖ్యమంత్రి పర్యటన ఉండే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి ప్రజా సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని

సూచించారు.రహదారులపై గుంతల పూడ్చివేత, పారిశుద్ధ్యం, ప్రజా సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)పై సస్పెన్షన్‌కు సంబంధించి పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదిక పంపాలని ఆదేశించారు.ప్రజల సంతృప్తే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాను ఉత్తమ పనితీరు కలిగిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు.

# రైతన్న మీకోసం కార్యక్రమంపై అవగాహన


ఎల్‌నినో, ఎరువుల వినియోగం, పంటల వైవిధ్యీకరణపై రైతులకు సూచనలు





**గంగవరం, పెన్ పవర్, జూన్ 22 :** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని గంగవరం మండలం గంగవరం గ్రామంలో సోమవారం "రైతన్న మీకోసం" పోస్టర్ విలేజ్, ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం జూన్ 22 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా గంగవరం సచివాలయ ఇన్‌చార్జి, వ్యవసాయ సహాయకుడు కళ్యాణ్ నాయుడు మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులకు ముందస్తు సన్నద్ధత, ప్రభావ నివారణ చర్యలు, ఎరువుల ఆన్‌లైన్ పంపిణీ వ్యవస్థ, సమతుల్య ఎరువుల వినియోగం, ఆదాయ వృద్ధి కోసం పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల వివరాలను రైతులకు వివరించారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ, గ్రామ కార్యదర్శి వీరావతుల రాజేంద్రప్రసాద్, సచివాలయ కార్యదర్శులు గోపీనాథ్ కృష్ణ, రాజ్‌కుమార్, బూత్ కన్వీనర్ సారపు సత్యవేణి, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మి, డీప వెంకటేష్, మహిళా పోలీస్ జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, ఏఎన్ఎం నారాయణమ్మ, ఆశా కార్యకర్తలు, రైతులు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజమహేంద్రవరం--భద్రాచలం బస్సు సమయం మార్పు



**ఇకపై ఉదయం 8.30 గంటలకే**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 22 :**పోలవరం జిల్లాలోని విలీన మండలాల ప్రయాణికుల సౌకర్యార్థం ఇటీవల ప్రారంభించిన రాజమహేంద్రవరం--కూనవరం మీదుగా భద్రాచలం వెళ్లే ఏపీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసు బయలుదేరే సమయాన్ని మార్చినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి యేలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు రాజమహేంద్రవరం డిపో నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరుతున్న ఈ బస్సు ఇకపై ఉదయం 8.30 గంటలకు బయలుదేరుతుందని వెల్లడించారు.ఐటీడీఏ ఉద్యోగులు, విలీన మండలాల ప్రజలు, స్థానిక ప్రయాణికుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాల ప్రజలకు ఈ సర్వీసు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ప్రయాణికులు ఈ బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకుని ఆదరించాలని జిల్లా ప్రజారవాణా అధికారి యేలూరి సత్యనారాయణమూర్తి కోరారు.

# రైతులకు సరసమైన ధరలకు ఉద్యానవన మొక్కలు

✷ పోలవరం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 22 :**
ఈ ప్రాంత రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల మేరకు నాణ్యమైన ఉద్యానవన మొక్కలను సరసమైన ధరలకు అందుబాటులో ఉంచినట్లు పోలవరం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ, రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని సిరిగిందలపాడు నర్సరీలో నాణ్యమైన జీడిమామిడి అంట్లు, జాఫ్రా, సీతాఫలం, మామిడి, పనస మొక్కలు రైతులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మొక్కలు అవసరమైన రైతులు ఐటీడీఏ పీహెచ్‌వో లేదా నర్సరీ ఇన్‌చార్జి అబ్బాయిరెడ్డిని సంప్రదించాలని సూచించారు.మొక్కల ధరలను ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం జీడిమామిడి మొక్క రూ.40, జాఫ్రా మొక్క రూ.25, మామిడి మొక్క రూ.45, సీతాఫలం మొక్క రూ.20, పనస మొక్క రూ.25గా నిర్ణయించినట్లు తెలిపారు.మొక్కలు పొందదలిచిన రైతులు తమ పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు ఖాతా వివరాలను తీసుకురావాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన ఈ తొలకరిలోనే మొక్కలను నాటి ఉద్యానవన పంటల సాగు చేపడితే మంచి ఫలితాలు పొందవచ్చని దేవదానం పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

✷ గ్రీవెన్స్‌లో 201, రెవెన్యూ క్లినిక్‌లో 17 దరఖాస్తులు స్వీకరణ
✷ కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 22 :**పోలవరం జిల్లాలోని మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను స్వీకరించి, కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, మరికొన్నింటికి సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్నామని పేర్కొన్నారు.సోమవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఆర్డీఓ కె. స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వారంలో గ్రీవెన్స్‌కు 201 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌కు 17 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. తాగునీటి సౌకర్యం, రహదారుల నిర్మాణం, విద్యుత్ సదుపాయాలు, విద్యా సౌకర్యాల విస్తరణ, గిరిజన రైతుల సమస్యలు, వికలాంగుల పెన్షన్లు, ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించినట్లు చెప్పారు..అందిన ప్రతి వినతిపత్రాన్ని పరిశీలించి అర్హత, అవసరాలను బట్టి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఏపీవోలు జనరల్ డిఎన్వి రమణ,రామ తులసి,గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య,పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ షేక్ షరీఫ్,డిఎం అండ్ హెచ్ఓ (ఇంచార్జ్ ) నీలిమ,సిపిఓ వెంకట్రావు, లేబర్ అధికారి మహేష్,సబ్ డిఎఫ్ఓ అనుష,డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్.దాసరి రత్నాకరరావు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, జిల్లా విద్యాశాఖ అధికారి జి.శ్రీరామ్ మూర్తి ,పీహెచ్ఓ నరేంద్ర కుమార్, విద్యాశాఖ అధికారి వై.మల్లేశ్వరరావు,జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్,ఐసిడిఎస్ జిల్లా అధికారి కే.ఉమా,జిల్లా సివిల్ సప్లై అధికారి విజయభాస్కర్,జిల్లా మలేరియా అధికారి భాస్కర రావు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, అచ్చుతాచారి, ఏడి మహంకాళేశ్వరరావు, డి సి హెచ్ ఎస్ సాంబశివరావు,జిల్లా ఎంప్లాయ్మెంట్ అధికారి నిరుపమ, పిఏఓ. ఎల్.రాంబాబు,తాసిల్దార్లు సిహెచ్.బాలాజీ,కే సత్యనారాయణ,ఏ సత్యనారాయణ, సిహెచ్ శ్రీనివాసరావు, తేజస్విని,వేణుగోపాల్,అమ్మాజీ, ఎంపీడీవోలు ప్రసాద్,బాపన్న దొర,సాల్మన్ రాజ్, కుమార్,లక్ష్మణ్,యాదగిరి ఈశ్వరరావు, చంద్రశేఖర్,డిప్యూటీ తహసిల్దార్లు శ్రీధర్,స్వామి, రవీంద్రబాబు,డి ఈ లు పి వెంకటరమణ,రామచంద్ర మూర్తి,భవాని, రమేష్,సుబ్బారావు, మల్లికార్జున రావు,లీడ్ బ్యాంక్ మేనేజర్ గొర్లె.బుజ్జిబాబు,ఆర్టీవో రాజేష్ కుమార్,సబ్ రిజిస్టర్ ఉపేంద్ర,ఐటీడీఏ ఏవోలు రాజ్ కుమార్, ఎర్రం శెట్టి రాజు,అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ఎం. శ్రీనివాసరావు,డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ ఎం.లక్ష్మణ్,ఏపీ ఈపీడీసీఎల్ ఇంజనీర్ సాలెం రాజ్ ,వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజినీర్లు, బ్యాంకు ప్రతినిధులు, ఐటీడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మద్దిగడ్డ కాలువ పనులకు 26 లక్షల రూపాయలు మంజూరు..



**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 22:** మద్దిగడ్డ ప్రాజెక్టు కాలువ పనులకు సుమారు 26 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు అడ్డతీగల మండల టిడిపి అధ్యక్షులు జె. వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం కాలువ మరమ్మత్తు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అడ్డతీగల మండలం పాపంపేట కాలువ మరమ్మత్తులు నిమిత్తం 12 లక్షల రూపాయలు మరియు నాయుడు పాకలు కాలువ మరమ్మత్తుల నిమిత్తం 14 లక్షల రూపాయలు ప్రభుత్వం వెచ్చించినట్లు రమణారెడ్డి తెలిపారు. మద్దిగడ్డ ప్రాజెక్ట్ నుండి వచ్చే నీరు పంట పొలాలకు వెళ్లే మార్గమధ్యంలో నీరు వృధా అవుతుందని,దీనివల్ల రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని రమణారెడ్డి అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని యుద్ధ ప్రాతిపదికన కాలువ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డీ. రాంబాబు, వంకా సతీష్ గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు ఎర్రం శెట్టి. రత్నకుమారి, ప్రకాష్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు కోసూరి. రాజబాబు, దువ్వాడ. వీర కృష్ణ,, సత్తిరెడ్డి ,కేసనకుర్తి. ఆనందరావు, బచ్చల. రాధాకృష్ణ, జనసేన జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు తాటికొండ. రాజేంద్ర, మరియు ఇరిగేషన్ జేఈ శేషగిరిరావు, కాంట్రాక్టర్ ఎం. ఏసుదాస్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.ద

## ఎటపాక మండల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన జనసేన నాయకులు



**చింతూరు, పెన్ పవర్, జూన్ 22:** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని ఎటపాక మండల ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జనసేన పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జనసేన పార్టీ ఎటపాక మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా త్రిపురపెంటవీడు గ్రామపంచాయతీ పరిధిలోని త్రిపురపెంటవీడు, గొల్లగూడెం రహదారి నిర్మాణం చేపట్టాలని, అలాగే గొల్లగూడెం వద్ద పుష్కర్ ఘాట్ నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా ఎటపాక మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో తీవ్ర సిబ్బంది కొరత ఉందని, మూడు ఆసుపత్రులకు కలిపి కేవలం ఇద్దరు వైద్యులు మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది కొరత కారణంగా ఏజెన్సీ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, తక్షణమే వైద్య సిబ్బందిని నియమించాలని కలెక్టర్‌ను కోరారు. మండలంలోని ముంపు గ్రామాలన్నింటినీ అధికారిక ముంపు జాబితాలో చేర్చడంతో పాటు, మండలాన్ని మొత్తం యూనిట్‌గా పరిగణించి 41.5 కాంటూర్ పరిధిలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పురుషోత్తపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలను కూడా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖల అధికారులకు నివేదికలు పంపించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు జనసేన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం మండల అధ్యక్షులు శ్రీను, ఎటపాక మండల కార్యదర్శి రాపోలు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఎలక్ట్రానిక్ కాటా విరాళం అందజేత



**కాజులూరు పెన్ పవర్ జూన్ 22:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాజులూరులో చదువుతున్న విద్యార్థి తండ్రి, స్థానిక శశి టిఫిన్ సెంటర్ యజమాని గోపి నాగేశ్వరరావు పాఠశాలకు విలువైన విరాళం అందజేశారు. పాఠశాలలో తయారుచేసే మధ్యాహ్న భోజన పథకానికి ఉపయోగించే ఆహార పదార్థాలను తూకం వేయడానికి అవసరమైన 100 కిలోల సామర్థ్యం గల ఎలక్ట్రానిక్ కాటాను సుమారు రూ.5 వేల వ్యయంతో అందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి మాట్లాడుతూ, ప్రభుత్వం పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నప్పటికీ కొన్ని అదనపు అవసరాలు ఏర్పడుతూనే ఉంటాయని అన్నారు. అలాంటి అవసరాలను తీర్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు.గోపి నాగేశ్వరరావును ఆదర్శంగా తీసుకుని మరింత మంది దాతలు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. దాతను సంప్రదించి పాఠశాలకు ఎలక్ట్రానిక్ కాటా అందించేలా కృషి చేసిన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్ధరాజుకు, దాత గోపి నాగేశ్వరరావుకు ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి, ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణమూర్తి, స్టాఫ్ సెక్రటరీ హరినాథ్, ఎండీఎం ఇన్‌చార్జి గౌతమీ సుధ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


## పులుసు మామిడి పాఠశాలకు డిప్యూటేషన్ పై ఉపాధ్యాయురాలు నియామకం





**వై రామవరం, పెన్ పవర్, జూన్ 22:** గతంలో మూతపడిన పులుసు మామిడి జిపిఎస్ కు డిప్యూటేషన్ పై ఉపాధ్యాయురాలు నియమించడం జరిగిందని వైరామవరం ఎంఈఓ 2 జోగేశ్వరరావు తెలిపారు.

మండలంలోని కోట పంచాయతీ బుల్లోజుపాలెం జిపిఎస్ నుండి బి చిట్టెమ్మ అనే ఉపాధ్యాయురాలని సోమవారం డిప్యూటేషన్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం పులుసు మామిడి జిపిఎస్ లో 14 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వీరందరూ వాన మామిడి గొంది ఎంపీపీ పాఠశాలలో చదువుతున్నారని తెలిపారు. తమ గ్రామంలో పాఠశాలను తిరిగి ప్రారంభించాలనే గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారని, అధికారుల ఆదేశాల మేరకు డిప్యూటేషన్ పై ఉపాధ్యాయురాలిని శనివారం 20వ తేదీన నియమించడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల యొక్క డైస్ కోడ్ మార్చవలసి ఉందని, అప్పుడే విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందే సౌకర్యాలు అందుతాయని తెలిపారు.




## సత్తుపల్లి--కొవ్వూరు రైల్వే లైన్‌తో జీలుగుమిల్లికి మహర్దశ

**జనసేన నేత గడ్డమణుగు రవికుమార్**



**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూన్ 22** ; సత్తుపల్లి కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఏజెన్సీ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం సాకారమయ్యే దిశగా కీలక ముందడుగని మాజీ జడ్పిటిసి, ద్వారక తిరుమల చిన్న వెంకన్న దేవస్థానం ధర్మకర్త మండలి స్పెషల్ ఇన్వైటి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ అన్నారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే రాష్ట్ర సరిహద్దు మండలమైన జీలుగుమిల్లికి ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు అభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.

జీలుగుమిల్లిలో సోమవారం ఆయన మాట్లాడుతూ, సత్తుపల్లి--కొవ్వూరు మధ్య సుమారు 119 కిలోమీటర్ల రైల్వే మార్గం నిర్మాణం పూర్తయితే హైదరాబాద్, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాలకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. అశ్వరావుపేట, జీలుగుమిల్లి తదితర పరిసర ప్రాంతాలు రవాణా, వాణిజ్య రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించి పట్టణీకరణ దిశగా అడుగులు వేస్తాయని అన్నారు. రైల్వే లైన్ అందుబాటులోకి రావడం వల్ల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో వేగంగా మార్కెట్లకు తరలించే అవకాశం లభిస్తుందని చెప్పారు. అలాగే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు సమీప పట్టణాలు, నగరాలకు సులభంగా చేరుకునే సౌకర్యం కలుగుతుందని వివరించారు.

ఏజెన్సీ ప్రాంత ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని రవికుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్మాత్మక రైల్వే మార్గం త్వరితగతిన పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. దశాబ్దాలుగా ఏజెన్సీ వాసులు ఎదురు చూస్తున్న ఆంధ్రా, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలకు మణిహారం, ఆంధ్రాకు ముఖద్వారం అయిన జీలుగుమిల్లికి రైల్వే స్టేషన్ రావడం, రైల్వే లైనుకు ఆమోదం తెలిపిన ఎన్డీఏ ప్రభుత్వానికి, కృతజ్ఞతలు తెలిపారు.

## అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే ముప్పిడి



**కొవ్వూరు, పెన్ పవర్, జూన్ 22:**కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ ప్రభుత్వ పథకాల పురోగతిపై కొవ్వూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించిన కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు. ఈ సందర్భంగా మండలాల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనులు, గ్రామాల్లో త్రాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు, ఉపాధి హామీ పనులు, గృహ నిర్మాణాలు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు.

## ఎస్ఐఆర్-2026 ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 22:**కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని పకడ్బందీగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. జూన్ 25 నాటికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయడంతో పాటు, స్వీకరించిన ఫారాలను సమాంతరంగా డేటా ఎంట్రీ చేయాలని సూచించారు. సోమవారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని హుకుంపేట, మోరంపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని వరలక్ష్మి నగర్ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి, ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, బీఎల్ఓల పనితీరు, ప్రత్యేక మొబైల్ యాప్ వినియోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు దుక్క ఆదిలక్ష్మి కుటుంబానికి సంబంధించిన ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ, 2002 సంవత్సరంలో నివాస వివరాలు తదితర అంశాలపై ఆరా తీశారు. అదే సమయంలో హెచ్ఎల్బీ-0176, 0177 గృహాలను సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించారు. సంబంధిత బీఎల్ఓలు మాట్లాడుతూ, తమ పరిధిలో 1,100 మందికి పైగా ఓటర్లు ఉన్నారని, అందులో సుమారు 60 శాతం మంది మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. కొంతమంది ఓటర్లు ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారని, ఓటర్ల తల్లిదండ్రుల పేర్లు, గత నివాస వివరాలు కూడా ధృవీకరిస్తున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఓటర్ల వివరాల నిర్ధారణలో కొన్ని ఇబ్బందులు ఎదురవు తున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ ప్రజలతో నేరుగా మాట్లాడి ఎస్ఐఆర్ ప్రక్రియపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూరించాలి, ఏయే వివరాలు నమోదు చేయాలనే అంశాలను సులభంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎస్ఐఆర్-2026 కోసం రూపొందించిన ప్రత్యేక యాప్ సమర్థవంతంగా పనిచేస్తోందని, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియ కొనసాగు తోందన్నారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని, పూర్తిచేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బీఎల్ఓలకు సకాలంలో అందజేసి ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలని కలెక్టర్ కీర్తి చేకూరి కోరారు. ఈ పర్యటనలో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఎన్నికల అధికారి భాస్కర్ రెడ్డి, సహాయ ఈఆర్వో శ్రీనివాస్, ఎంపీడీవో కె. సునీల్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎమ్మెస్సెన్ ప్రసాద్, బొప్పన నానాజీ, డి. రమేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమంపై ఓటర్లలో విస్తృత అవగాహన కల్పించేందుకు మోటార్ సైకిళ్లపై మైక్ ఏర్పాటు చేసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించడం, వాటిని సకాలంలో పూర్తిచేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేయడం, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ఖచ్చితమైన, పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలందరూ సహకరించాలని ప్రచారం ద్వారా విజ్ఞప్తి చేశారు.

## నూతన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముప్పిడి

**చాగల్లు, పెన్ పవర్, జూన్ 22:**మండలంలోని మార్కొండపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన కొవ్వూరు నియోజకవర్గ శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం ద్వారా గ్రామంలోని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఆళ్ళ హరిబాబు, ఏఎంసి నాదెళ్ల శ్రీరామ్, సుంకవల్లి రమేష్, గా ఉప్పులూరి చిరంజీవి, యంద్రపాటి అబ్బులు, మద్దిపాటి రాఘవులు, బొల్లిన నాగేంద్ర, బొడ్డు రాజు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రైతన్న మీకోసం కార్యక్రమం ప్రారంభం





**రైతు కుటుంబాలకు వారంపాటు అవగాహన కార్యక్రమాలు**

**గంగవరం, పెన్ పవర్, జూన్ 22:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతులకు వ్యవసాయం, అనుబంధ రంగాలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన "రైతన్నా... మీకోసం" కార్యక్రమం గంగవరం మండలంలో సోమవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారి కె. విశ్వనాథ్ తెలిపారు. లక్కొండ రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 22 నుంచి 27 వరకు మండల వ్యాప్తంగా వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ప్రతి రైతు కుటుంబాన్ని సందర్శించి వ్యవసాయానికి సంబంధించిన పలు కీలక అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కొత్త ఎరువుల ఆన్‌లైన్ విధానం, ఆన్‌లైన్ ద్వారా విత్తనాల పంపిణీ, ఎల్‌నినో ప్రభావం, పంటల మార్పిడి, అపరాల సాగు విస్తరణ, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. గంగవరం, లక్కొండ, మోహనాపురం, నెల్లిపూడి, జడేరు, మర్రిపాలెం, పిడతమామిడి, కొత్తడ గ్రామ సచివాలయాల పరిధిలో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, మాజీ ఎంపీపీ తీగల ప్రభతో పాటు రైతులు, వ్యవసాయ మరియు అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.


## గ్యాస్ లీక్ అయి చికెన్ షాప్ దగ్ధం తప్పిన పెను ప్రమాదం.





**గోకవరం పెన్ పవర్ జూన్ 22:--** గ్యాస్ సిలిండర్ లీక్ పైన కారణంగా ఒక్కసారిగా మంటలు సెలరాగడంతో చికెన్ షాప్ నిర్వహిస్తున్న ఒక పూరిపాక దగ్ధమైంది ఇది గోకవరం మండలం రంప ఎర్రం పాలెం గ్రామం ప్రధాన రహదారిపై రహదారిని ఆనుకుని సోమవారం మూడు గంటల సమయంలో సంభవించింది దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉంగరాల పుల్లయ్య అనే వ్యక్తికి చికెన్ షాప్ (పూరిపాక) ఇటీవల ఏర్పాటు చేసు కున్నాడు ఈ అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. కోళ్లను శుభ్రపరిచే యంత్రం, ఫ్యాన్, గ్యాస్ సిలిండర్, పొయ్యి, పూరిపాక పూర్తిగా కాలిపోయింది. 15 కోళ్లు వరకు పూర్తిగా కాలిపోగా కొన్ని కోళ్లు గాయపడ్డాయి ఈ అగ్ని ప్రమాదం వల్ల సుమారు లక్ష రూపాయలు దాటి ఆస్తినష్టం సంభవించిదని యజమాని కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నాడు.

## సోషల్ మీడియా వేదికగా అధికారుల వైఖరిని ఎండ గడుతున్న మహిళ...????


GOKAVARAM MEDIA...
14 online

చల్ల రాజ్యలక్ష్మి జనసేన
పేకాట శిబిరాలపై దాడి చేస్తూ ఎక్కడ జుదం ఆడిన సమాచారం అందిన వెంటనే స్పందించే అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు 🙏🙏🙏🙏

అలాగే పండగ రోజుల్లో కూడా చాలాచోట్ల గేమ్లింగ్ జరుగుతుందని. (గుండాట కోడి పందాలు బొమ్మ బోరుసు పేకాట ఇతరాత్ర జుదం) ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకో పోవడానికి

కారణాలు ఏమిటో???

భారీగా అందిన కాసుల మహత్యమా???
లేక ఆ మూడు రోజులు డిపార్ట్మెంట్ మొత్తం ఏమైనా సెలవులో ఉందా??
మాకు తెలియక అడుగుతున్నాం సుమ తప్పుగా అనుకోవద్దు అంటున్నారు ప్రజలు..

ప్రజలకు సమాధానం చెప్పవలసిన బాధ్యత అధికారులకు ఉందనుకుంటాను 🙏🙏

**గోకవరం పెన్ పవర్ జూన్ 22 :--** మండలంలో ఎక్కడ ఏది జరిగిన అధికారులు వైఖరి పాత్ర ఉంది తీరుతుంది అని సోషల్ మీడియా వేదికగా మండలంలోని కొంతమంది సామాజికవేత్తలు ప్రసారం చేస్తున్నారు అయినా సరే వాళ్ళ స్వలాభమే ధ్యేయం గా ముందుకు వెళుతున్నట్టు మరి కొంతమంది అంటున్నారు. వీరి అందరికన్నా ముందు వరసలో గోకవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కూటమి మహిళా నాయకురాలు చల్లా రాజ్యలక్ష్మి ఒక అడుగు ముందు వరుసలోనే ఉన్నారు అనడంలో అతిశయోక్తి లేదు. ఎక్కడ ఏది జరిగిన అరవై శాతం అధికారులు అవినీతి అక్రమాలే ప్రధాన కారణమని అలా కాకుంటే ఎందుకు అధికార స్పందించడం లేదని ప్రజల చేత ప్రజల ద్వారా కట్టిన పనులు జీతాలుగా తీసుకుని రాజ భోగాల అనుభవిస్తున్న అధికారుల్లారా సిగ్గులేదు అంటూ అనేక పర్యాయాలు అధికారులు పనితీరును ఎండగడుతూ నిత్యం సోషల్ మీడియా లో ఒక మహిళ నేతగా నిలుచున్నారంటే ఆమె ధైర్య సాహసాలకు మెచ్చుకుని తీరాల్సిందే అని పలువురు సామాజిక వేత్తలు అంటున్నారు. ఏ అధికారి ఏ పని చేసినా ఆపనిలో ఆ అధికారి పాత్రను ఎండగడుతూనే అందరికన్నా ముందు సోషల్ మీడియా వేదికన ఉపయోగించుకుని ప్రసారం చేయిస్తూ అవినీతి అధికారులపై గళం విప్పుతున్నారు సోమవారం ఒక జూదక్ క్రీడల్లో గోకవరం పోలీసులు కొంతమందిని అరెస్టు చేసి కోర్టుకు తరలించడం జరిగింది దీనిపై వచ్చిన వార్తలపై స్పందిస్తూ ఆరోగ్యం బాగోలేక మరి ఇతర కారణాలతోనో ఎక్కడైనా కదు పేద పిల్లలు పేకాట ఆడుతూ కనిపిస్తే వాళ్లను తీసుకువస్తున్న మీకు సంక్రాంతి సమయంలో జూదాలపై ఫిర్యాదు చేసిన పట్టించుకోక పోవడం పై అవినీతి పాత్ర లేదంటారా అంటూ ఆమె ప్రశ్నించడం సోషల్ మీడియాలో వేదికగా ఆమె ప్రశ్నించడం మండలంలో వ్యవస్థ నియలేత్తి చూపించినట్లు హాట్ టాపిక్ గా చర్చించుకుంటున్నారు. ఇలా ఒక్కటే డిపో కబ్జాలు ఆర్థిక లావాదేవీలు మహిళలపై జరుగుతున్న దాడులు మహిళ టాయిలెట్లు ఆక్రమించుకుని బిల్డింగులు కట్టడం డ్రైనేజీలు పూడ్చి గృహాలు నిర్మించడం ఒకటా రెండా కాదు ఏ ఆక్రమణ అవినీతి జరిగిన ప్రశ్నించే మహిళగా మండలంలో కూటమి ప్రభుత్వంలో ఒక మహిళ ధైర్యంగా ముందుకు రావడం కూడా సాహసమేనని పలువురు చర్చించు కుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో ఉంటూ అధికార్ల తీరుని ఎండ కట్టడం పై కొంతమంది నాయకులకు మింగుడు పడకపోయినా తేలుకుట్టిన దొంగల మౌనంగా ఉండడం పట్ల పలువురు చెవులు కోరుకుంటున్నారు.

## మహిళల భద్రతపై పోలీసుల అవగాహన సదస్సు

- మహిళలపై మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఏఎస్పీ హేమంత్





**చింతూరు, పెన్ పవర్, జూన్ 22:** మహిళలపై జరుగుతున్న మోసాలు, అన్యాయాలు, మొబైల్ ఫోన్‌ల ద్వారా జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఏఎస్పీ హేమంత్ సూచించారు. మహిళల భద్రతపై అవగాహన కల్పించేందుకు సోమవారం చీడుమూరు గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొబైల్ వినియోగం పెరిగిన నేపథ్యంలో సైబర్ మోసాలు కూడా అధికమవుతున్నాయని, ముఖ్యంగా మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే వెంటనే 112 నంబర్‌కు కాల్ చేయాలని, విద్యార్థినులు తప్పనిసరిగా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌ను నమ్మవద్దని, అలాంటి కాల్స్ వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువతకు చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించిన ఏఎస్పీ, బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనని హెచ్చరించారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే అతివేగంగా వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు లేదా నలుగురు ప్రయాణించడం నేరమని పేర్కొన్నారు. మైనర్ బాలబాలికలకు వాహనాలు ఇవ్వకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయడం లేదా అలాంటి కార్యకలాపాలకు సహకరించడం చట్టరీత్యా నేరమని, గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని స్పష్టం చేశారు. మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై మాట్లాడుతూ, అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచిస్తూ యువత, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్ నినో పై ప్రభావం నుంచి రైతులు తప్పించుకోవడం పై అవగాహనా. ఏ ఓ రాజరాజేశ్వరి.





**గోకవరం పెన్ పవర్ జూన్ 22:**–రైతులు పంటలు నష్టపోకుండా ఎల్ నినో ప్రభావం నుంచి రైతులు తప్పించు కోవడం పై అవగాహనా ఈ కార్యక్రమం గోకవరం మండలం వ్యవసాయ శాఖ అధికారిణి రాజరాజేశ్వరి అధ్యక్షతన కృష్ణునిపాలెంలో నిర్వహించారు. రైతన్నా మీకోసం కార్యక్రమం సోమవారం నుండి 27 వ తేది శనివారం వరకు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రత భూసారాన్ని కాపాడుకోవడం వాటి పై డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ నుండి ఏ డి ఏ. జయరామలక్ష్మీ రైతులకు వివరిస్తూ దీర్ఘ కాలిక విత్తనాలు కాకుండా తక్కువ పంట కాలం ఉండేవి నాటుకోవాలి అని ఏపీ ఎయిమ్స్ యాప్ 2.0 ద్వారా యూరియా డిఏపి ఎరువుల పంపిణీ గూర్చిన అవగాహన మరియు సిఫార్సు మేరకు మాత్రమే ఎరువుల వాడకం మరియు ప్రకృతి వ్యవసాయం లో పచ్చి రొట్ట విత్తనాలు అపరాలు నాటడం వల్ల భూ సారం కాపాడుకోవచ్చు అని అన్నారు. క్రిష్ణునిపాలెం కామరాజుపేట రైతులతో చర్చించడం జరిగింది.

ఈ అవగాహనా సదస్సుకు కామరాజు పేట సొసైటీ చైర్మన్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు. యూరియా డి ఏ పి ఎరువుల సరఫరా మొత్తం రైతు సేవా కేంద్ర సిబ్బంది ఆధార్ తో వెరిఫై చేసిన రైతులకు మాత్రమే సొసైటీలు ప్రైవేట్ దుకాణదారులు సరఫరా చేస్తారు అని తెలియచేయడం జరిగింది.

# ఆలమూరులో తారు ప్లాంట్ ఏర్పాటును అడ్డుకోవాలి





**కాలుష్యం, ప్రమాదాలపై రైతుల ఆందోళన**

**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 22;** ఆలమూరు గ్రామ సమీపంలో ప్రతిపాదిత తారు మిక్సర్ ప్లాంట్ ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని గ్రామ రైతులు, స్థానికులు సోమవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్తపేట ఆర్డీవో జి.వి.వి. సత్యనారాయణ, ఆలమూరు తహసీల్దార్ కుశరాజు, ఎంపీడీవో రాజులకు, వినతిపత్రాలు అందజేశారు. మసీదు రోడ్డుకు ఆనుకుని, గ్రామానికి అత్యంత సమీపంలో ఉన్న వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి తారు మిక్సర్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి అతి దగ్గరలో ఇటువంటి పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల వాయు కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ప్లాంట్ నుంచి వెలువడే పొగ, ధూళి, రసాయన పదార్థాల కారణంగా ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అలాగే భారీ వాహనాల రాకపోకలు పెరగడం వల్ల గ్రామ పరిధిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన ఆలమూరులో ఇటువంటి పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల పంటలపై, భూసారంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల చొప్పెల్ల గ్రామంలో కూడా తారు మిక్సర్ ప్లాంట్ ఏర్పాటుపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పచ్చని గ్రామాలు, నివాస ప్రాంతాలకు సమీపంగా కాలుష్యకారక పరిశ్రమలు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజారోగ్యం, రైతుల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతిపాదిత తారు మిక్సర్ ప్లాంట్ ఏర్పాటును నిలిపివేయాలని వారు కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఎమ్మెల్సీ కాలేజీల్లో అన్నీ లోపాలే

**గుంటూరు, జూన్ 22, పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తనయుడు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కృష్ణ చైతన్య విద్యాసంస్థల పై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ఈ విద్యాసంస్థలకు చెందిన ఆరు జూనియర్ కళాశాలలపై గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ప్రత్యేకంగా వచ్చిన విద్యాశాఖ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రారంభమైన ఈ తనిఖీలు అర్ధరాత్రి దాటే వరకు సాగాయి.అధికారుల సుదీర్ఘ తనిఖీల్లో సదరు విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను ఏ ఒక్కటి కూడా సక్రమంగా పాటించడం లేదనే దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. అగ్నిమాపక శకటం వెళ్లేందుకు కనీస స్థలం లేకపోవడం, ఫైర్ సేఫ్టీ అనుమతులు గడువు ముగిసినా నూతనీకరించకపోవడం, సామర్థ్యానికి మించి ఒకే గదిలో విద్యార్థులను గొర్రెల మందలా ఉంచడం వంటి అనేక లోపాలను అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, ల్యాబ్‌లలో కెమికల్స్ భద్రత సరిగా లేకపోవడం, విద్యార్థులకు కనీస తాగునీరు, పరిశుభ్రమైన శానిటేషన్ వసతులు కూడా కల్పించకపోవడాన్ని కూడా గుర్తించారు.రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఉండేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. పొరుగు జిల్లా అయిన గుంటూరుతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించారు. కాలేజీ రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లు, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్, హాస్టల్ అనుమతులకు సంబంధించిన ప్రతీ పత్రాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అర్ధరాత్రి దాటే వరకు అటెండెన్స్ సాఫ్ట్‌వేర్ డేటాను, అడ్మిషన్ల రికార్డులను క్రాస్ వెరిఫై చేసిన అధికారులు.. అనుమతులు లేని అదనపు సెక్షన్లను నడుపుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించి ఆయా ఫైళ్లను సీజ్ చేశారు.ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు చైర్మన్‌గా ఉన్న విద్యాసంస్థలు కావడంతో, ఐదేళ్ల హయాంలో ఇక్కడి లోపాలపై స్థానిక అధికారులు కన్నెత్తి కూడా చూడలేదనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా రూల్స్ ఉల్లంఘించే కార్పొరేట్ కాలేజీలపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ తనిఖీలపై గుంటూరు, నెల్లూరు అధికారులు తుది నివేదికను ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌కు సమర్పించనున్నారు. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కిన కృష్ణ చైతన్య విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు భారీగా జరిమానా విధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉన్నతాధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ముద్రగడకు భరోసా ఎవరు...

**కాకినాడ, జూన్ 22, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన సీనియర్ కాపు నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న ముద్రగడ అస్వస్థతకు గురికావడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రి యశోదకు తరలించారు. అయితే, అక్కడ వైద్య ఖర్చులు ఊహించని స్థాయిలో ఉండటంతో.. ఆ బిల్లులు భరించలేక రాత్రికి రాత్రే ఆయనను సమీపంలోని ఒక చిన్న ప్రైవేట్ ఆస్పత్రికి మార్చడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముద్రగడను కేవలం రాజకీయ అవసరాల కోసమే వాడుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , ఇప్పుడు ఆయన వైద్యానికి కనీస భరోసా ఇవ్వకపోవడంపై ముద్రగడ అనుచరులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.గత సార్వత్రిక ఎన్నికల నుంచి వైసీపీకి కాపు అస్త్రంగా ముద్రగడ ఉపయోగపడ్డారు. ఆయనకు ఇష్టం లేకపోయినా, వయసు సహకరించకపోయినా.. ఆయన కుమారుడికి రాజకీయ ప్రాధాన్యత ఇస్తామంటూ, భవిష్యత్తు బాగుంటుందంటూ వైసీపీ అగ్రనాయకత్వం ముద్రగడను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు నాయుడిని, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ముద్రగడతో ఘాటైన లేఖలు రాయించడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించడం, ఆఖరికి అనారోగ్యంతో ఉన్నా బలవంతంగా వీడియో బైట్స్ విడుదల చేయించడం వెనుక వైసీపీ వ్యూహకర్తలే ఉన్నారన్నది బహిరంగ రహస్యం. తాజాగా సాయికృష్ణ ఉదంతంలో ఆయనతో ఓ లేఖ రాయించేందుకు ప్రయత్నించారు. కానీ ఈలోపే ఆయన ఆసుపత్రి పాలవ్వడంతో కథ అడ్డం తిరిగింది.హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ వైద్య ఖర్చుల విషయంలో సాయం కోరేందుకు ఆయన కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు తాడేపల్లి ప్యాలెస్‌ను, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని సంప్రదించేందుకు గట్టిగానే ప్రయత్నించినట్లు సమాచారం. అయితే, ఈ సంప్రదింపుల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయని టాక్. అసలు ఎవరూ పట్టించుకోలేదు. కార్పొరేట్ ఆసుపత్రి భారీ ఖర్చులకు సంబంధించిన ఆర్థిక భరోసా లేదా సాయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని తెలుస్తోంది.ముద్రగడ పద్మనాభం లాంటి ఒక సీనియర్ లీడర్‌ను ఆపద సమయంలో వైసీపీ ఒంటరిని చేసిందనే వార్త గోదావరి జిల్లాల్లోని కాపు శ్రేణులను తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. అవసరమైనప్పుడు పవన్ కల్యాణ్‌పైకి ఉసిగొల్పి.. పంతానికి పోయి పేరు మార్చుకునే దాకా ముద్రగడను వాడుకుని, ఇప్పుడు వైద్యం చేయించుకునే పరిస్థితి వస్తే చేతులెత్తేస్తారా అంటూ క్షేత్రస్థాయి అనుచరులు మండిపడుతున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను తిట్టడానికే ముద్రగడ పనికొచ్చారా.. ఆయన ప్రాణాల కంటే పార్టీ ప్రయోజనాలే ఎక్కువయ్యాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి.ఓ వైపు ముద్రగడ ఆరోగ్యపరిస్థితి బాగోలేక ఆస్పత్రిలో ఉంటే కాపు నాయకుల పేరుతో తోట త్రిమూర్తులు వంటి వారు హడావుడి ప్రారంభించారు. రాజకీయాల్లో యూజ్ అండ్ త్రో జగన్‌కు కొత్తేమీ కాకపోయినా.. ముద్రగడ లాంటి సుదీర్ఘ రాజకీయ చరిత్ర గల నేత విషయంలో ప్రదర్శిస్తున్న వైఖరి ఆ పార్టీ నైతికతను ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రత్యర్థులపై బురద చల్లడానికి ఒక సీనియర్ నేత ఇమేజ్‌ను ఎమోషనల్‌గా వాడుకుని, ఆయన ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి బెడ్‌పై ఉంటే ఆర్థికంగా ఆదుకోకపోవడం ముద్రగడ అనుచరులకే కాకుండా తటస్థులకు కూడా మింగుడుపడటం లేదు

## అనంతపురం టూ అమరావతి...

**అనంతపురం జూన్ 22, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వేగంగా చేరుకునేలా ఆయా జిల్లాల్లో ప్రభుత్వం పలు ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో హైవేలు, రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంకానున్నాయి. అనంతపురం జిల్లా నుంచి అమరావతికి వేగంగా చేరుకునేలా ప్లాన్ చేశారు. ఈ రోడ్లకు సంబంధించిన పనులు పూర్తిచేస్తే ప్రయాణ సమయం తగ్గుతుందంటున్నారు. రాజధాని అమరావతికి అన్ని జిల్లాల నుంచి కనెక్టివిటీ ఉండేలా ప్లాన్ చేసింది. కేంద్రం సహకారంతో కొత్తగా రోడ్లకు సంబంధించి ప్రాజెక్టుల్ని తీసుకొచ్చే పనిలో ఉంది. అనంతపురం జిల్లా నుంచి అమరావతికి వెళ్లడానికి హైవేలు, రోడ్లకు సంబంధించిన ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లేందుకు నేషనల్ హైవే-544జీ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం 624 కి.మీ.ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ విజయవాడ నుంచి బెంగళూరుతో కనెక్ట్ చేస్తోంది. విజయవా నుంచి నేషనల్ హైవే 16 మీదుగా వచ్చి ప్రకాశం జిల్లా ముప్పవరం, అద్దంకి మీదుగా హైవే వెళుతుంది. ఈ హైవే పూర్తి చేస్తే 110 కి.మీ.లు దూరం తగ్గి, ప్రయాణ సమయం తగ్గుతుందంటున్నారు. ఈ హైవే ప్రకాశం, నెల్లూరు, కడప, శ్రీ సత్యసాయి జిల్లా మీదుగా వెళుతుంది. అలాగే అనంతపురం జిల్లా నుంచి అమరావతి వెళ్లేందుకు రోడ్ల అనుసంధానంపై ఫోకస్ పెట్టారు.మలకవేముల క్రాస్ దగ్గర జంక్షన్ ఏర్పాటు చేసి బీకేవీ (బెంగళూరు, కదిరి, విజయవాడ) ప్రాజెక్టు ద్వారా అనంతపురం జిల్లా జిల్లా నుంచి అమరావతికి కేవలం 5 గంటల్లో చేరేలా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంకానున్నాయి. ముదిగుబ్బ నుంచి కదిరి వరకు 4 లైన్ హైవేను రూ. 707 కోట్లతో నిర్మించనున్నారు. అనంతపురం, బెంగళూరులను అనుసంధానం చేసే రోడ్లను మలకవేముల క్రాస్ దగ్గర కలుస్తాయి. అక్కడి నుంచి నేరుగా విజయవాడకు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి నాలుగు లైన్ల రోడ్డు కూడా ప్రతిపాదించారు. అనంతపురం నుంచి ఉరవకొండకు రోడ్డు ప్రతిపాదన కన్సల్టేషన్ స్థాయిలో ఉంది. గుత్తి - కర్ణాటకలోని బీదర్ హైవే విస్తరణ కూడా చేపట్టారు. అలాగే రూ.230 కోట్లతో గుంతకల్లు - బళ్లారి రోడ్డు విస్తరణకు కొత్తగా టెండర్ పిలిచారు.రాయదుర్గంలో రూ.54 కోట్లతో రైల్వే బ్రిడ్జి, రోడ్డు విస్తరణ పనులు మొదలుకానున్నాయి. రూ.25 కోట్లతో ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి రోడ్డు విస్తరణకు టెండర్‌లు ఆహ్వానించారు. కదిరిలో రోడ్లు, డ్రైన్లకు సంబంధించి ఇక రూ.30 కోట్లతో పనులు ప్రారంభించనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నేషనల్ హైవే అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టారు. రోడ్ల విస్తరణతో పాటుగా అన్ని పనుల్ని పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయంటున్నారు. మలకవేముల జంక్షన్ కీలకంగా మారుతుందంటున్నారు. ప్రయాణ సమయం తగ్గి అమరావతికి ఐదు గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. ప్రస్తుతం బెంగళూరు టు విజయవాడ మధ్య నేషనల్ హైవే-544జీ పనులు కూడా చకచకా సాగుతుండటంతో బెంగళూరు, అనంంతపురం నుంచి అమరావతికి , విజయవాడకు త్వరగా వెళ్లొచ్చు.. ప్రయాణ సమయం తగ్గుతుందని భావిస్తున్నారు.

## ఏపీలో సర్..డర్

**తిరుపతి, జూన్ 22, పెన్ పవర్:** అధికార పార్టీ అయినా.. అపోజిషన్ లీడర్లు అయినా ఇప్పుడు అందరికీ ఒకటే ఫోబియా. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయి.. బెంగాల్‌లో దీదీకి చుక్కలు కనిపిస్తున్నాయి. అటు టీఎంసీ, ఇటు డీఎంకే ఓడటమే కాదు.. రెండు పార్టీల అధినేతలు సీఎంగా ఉండి సొంత సీటులో ఓటమి చవిచూశారు. ఇదంతా సరే. ఆ స్టేట్స్‌లో వాళ్లిద్దరు ఓడితే.. ఏపీలో పార్టీలకు, లీడర్లకు టెన్షన్ ఎందుకనే కదా డౌట్. అక్కడికే వస్తున్నా.. కేంద్రం చేపట్టిన సర్ ప్రక్రియే.. బెంగాల్‌లో గెలుపోటముల్ని డిసైడ్ చేసిందన్న ప్రచారంతో ఢిల్లీ టు అమరావతి.. ఆ సర్ చుట్టూనే రాజకీయాలు చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా ఏపీలో అపోజిషన్‌లో వైసీపీ అయితే ఫుల్ అటెన్షన్ మోడ్‌లోకి వచ్చేసింది. అందరికంటే ముందే సర్ పై తాడేపల్లి క్యాంప్ ఆఫీస్‌లో కీలక సమావేశం నిర్వహించిన జగన్.. లీడర్లకు దిశానిర్దేశం చేశారు. అలర్ట్‌గా ఉండాలని.. ఎక్కడా తమ పార్టీకి చెందిన ఓటర్ల ఓట్లు పోకుండా క్రాస్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్. మరణించిన, చిరునామా మారిన, అలాగే డూప్లికేట్ ఓట్లను తొలగించడం, కొత్త ఓటర్లను నమోదు చేయడం సర్ ముఖ్య ఉద్దేశం. 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేసుకుంటూ, తాజా ఓటర్ల వివరాలు సేకరిస్తూ వస్తున్నారు. బూత్ లెవల్ అధికారులు డోర్ టు డోర్ సర్వే చేస్తున్నారు. ఏపీలో ఈ నెల 15న మొదలైన ఈ ప్రక్రియ వచ్చే నెల 15 వరకు.. నెలరోజుల పాటు కొనసాగుతుంది. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటికి వచ్చినప్పుడు ఓటర్లు లేకపోతే అంతే సంగతులు. ఈ మాటే అటు పార్టీలకు.. ఇటు లీడర్లకు కంటిమీదు కునుకు లేకుండా చేస్తోంది. డిసెంబర్‌లో కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియ ఈ ఏడాది జరిగిన రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేసిందన్న వాదన బలంగా ఉంది. సర్ ప్రక్రియనే కొందరు ముఖ్యనేతల తలరాతలను మార్చేసిందన్న టాక్ వినిపిస్తోంది. సర్ ప్రక్రియ కింద ఒక్క తమిళనాడు రాష్ట్రంలోనే 97లక్షల ఓట్లు తొలగించినట్లు అంచనా. ఈ ఓట్లు తొలగింపు దాదాపు 40 అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిందని అంటున్నారు. డీఎంకే అధినేత స్టాలిన్ పోటీ చేసిన కొలత్తూరు నియోజకవర్గంలో ఏకంగా లక్షకు పైగా ఓట్లను ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగించారు. ఆయన కొలత్తూరులో 8వేల 795 ఓట్ల తేడాతో ఓడిపోయారు. పెద్దఎత్తున జరిగిన ఓట్లు తొలగింపే కొలత్తూరులో స్టాలిన్‌ను ఓటమి పాలు చేసిందని బలంగా నమ్ముతున్నారు డీఎంకే నేతలు.ఇక పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షలకు పైగా ఓట్లు డిలీటయ్యాయి. ఆ స్టేట్‌లోని మొత్తం ఓట్లలో ఇది దాదాపు 12 శాతం. ఒక్క ఓటుతోనే నేతల జాతకాలు, తలరాతలు మారుతున్న పరిస్థితి. అలాంటిది 12 శాతం ఓట్లు లేకుండా పోతే..రిజల్ట్ షాకింగ్‌గా ఎందుకుండవన్న చర్చ జరుగుతోంది. బెంగాల్‌లో 294 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30 స్థానాల్లో గెలుపు మార్జిన్ కంటే, అక్కడ తొలగించిన ఓట్లే ఎక్కువ. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ పోటీ చేసిన భవానీపూర్‌లో 50 వేల ఓట్లు డిలీట్ అయ్యాయట.

# కదిరిలో సవాళ్లు.. ప్రతి సవాళ్లు

**అనంతపురం, జూన్ 22, పెన్ పవర్:** సత్యసాయి జిల్లాలో టీడీపీ వర్సెస్ వైసీపీ రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా కదిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి మధ్య నడుస్తున్న వ్యక్తిగత ఆరోపణలు, సవాళ్లు కదిరి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. ఇరు పార్టీల నేతలు అవినీతి, కబ్జాలు, కుటుంబ సభ్యులపై ఆరోపణలతో బహిరంగ చర్చలకు సై అంటూ సవాళ్లు విసురుకుంటున్నారు.

కదిరి టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థాయి వేరు.. ఆయన తండ్రి వైఎస్సార్ కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అలాంటి నాయకుడి భార్యను అకారణంగా రాజకీయాల్లోకి లాగి అవమానిస్తావా అంటూ ప్రవీణ్ రెడ్డి ఎమ్మెల్యేను నిలదీశారు. నీతి, నిజాయితీల గురించి మాట్లాడే ముందు ఎమ్మెల్యే తన గతం, చరిత్ర గురించి ఆలోచించుకోవాలని, మహిళల గురించి మాట్లాడే ముందు కొంత సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారుఎమ్మెల్యే ప్రసాద్ అవినీతి గురించి మాట్లాడితే కదిరి ప్రజలు నవ్వుకుంటున్నారని ప్రవీణ్ రెడ్డి ఎద్దేవా చేశారు. కదిరి నియోజకవర్గంలో బ్రాందీ షాపులు, పల్లెల్లో బెల్ట్ షాపులు పెట్టించి.. మద్యం బాటిల్‌పై రూ. 20 నుండి రూ. 40 వరకు అధికంగా అమ్మించి కమిషన్లు దండుకుంటోంది ఎమ్మెల్యే కాదా? అని ప్రశ్నించారు. ఆ అక్రమంగా వసూలు చేసిన డబ్బులు మీ ఇంట్లో వాళ్లు ఇస్తున్నారా అని మేము అడిగితే అది తప్పు అవుతుందా? అని ఘాటుగా నిలదీశారు. అంతేకాకుండా, కదిరిలో ఎమ్మెల్యే తన ఇంటి ముందున్న దేవుడి మాన్యం స్థలాన్ని 15 ఏళ్లుగా కబ్జా చేసి సొంత పార్కింగ్‌గా వాడుకోవడం నిజం కాదా అంటూ దేవాదాయ శాఖ భూముల కబ్జాపై సంచలన ఆరోపణలు చేశారు.గడిచిన రెండున్నరేళ్ల కాలంలో కదిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమని ప్రవీణ్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా కదిరిలో మైనార్టీ ముస్లింలపై ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పేద ముస్లింలు పెళ్లిళ్లు చేసుకునే ప్రభుత్వ షాదీ మహల్‌కు రెండున్నరేళ్లుగా ఎందుకు తాళాలు వేశారు? వారు చేసిన పాపం ఏంటి? అని ప్రశ్నించారు. ఇది చాలదన్నట్లు, కదిరి కాలేజీ సర్కిల్‌లో కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ బోర్డు స్థలంలో ముస్లింల సమాధులను సైతం తొలగించి, ఆ స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా వేసి అమ్ముకోవాలని ఎమ్మెల్యే ప్రయత్నించడం వాస్తవం కాదా అంటూ నిలదీశారు.కదిరిలో తాను అడిగిన సూటి ప్రశ్నలకు ఎమ్మెల్యే ప్రసాద్ నేరుగా సమాధానం చెప్పాలని, తన అనుచరులను ప్రయోగించి పారిపోవద్దని ప్రవీణ్ రెడ్డి సవాల్ విసిరారు. వారిని బలి చేయవద్దు. రేపు ప్రభుత్వం మారితే నీకంటే ముందు వాళ్లే కేసుల్లో ఇరుక్కుంటారు, అప్పుడు వారి పరిస్థితి ఏమిటో ఆలోచించు అని హెచ్చరించారు. మనం ఇద్దరం నేరుగా కూర్చుని కదిరి అభివృద్ధిపై, కబ్జాలపై మాట్లాడుకుందాం. ఏ చర్చకైనా నేను సిద్ధం అంటూ బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. ప్రస్తుతం కదిరిలో వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య జరుగుతున్న ఈ మాటల యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. భూకబ్జాలు, మద్యం మాఫియా, వక్ఫ్ ఆస్తుల ఆక్రమణల వంటి కీలకమైన ఆరోపణలు తెరపైకి రావడంతో స్థానిక రాజకీయాలు వేడెక్కాయి. ప్రవీణ్ రెడ్డి విసిరిన ఈ సవాళ్లపై ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ , టీడీపీ శ్రేణులు ఏ విధంగా స్పందిస్తాయో, ఈ బహిరంగ చర్చ సవాల్ ఎక్కడి వరకు దారితీస్తుందో అని కదిరి ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# సాయికృష్ణ కేసు.. మార్కాపురం టు విజయవాడ మధ్యలో ఏం జరిగింది?

**ఒంగోలు, జూన్ 22, పెన్ పవర్:** విజయవాడ నగరంలో సాయికృష్ణ అదృశ్యం కేసు ఇప్పుడు పెను సంచలనంగా మారింది. అసలు సాయికృష్ణ ఏమయ్యాడు, పోలీసులు కస్టడీలో ఉండగానే ప్రాణాలు కోల్పోయాడా? లేదా ఎవరైనా మాయం చేశారా? ఈ ప్రశ్నల చుట్టూ తిరుగుతున్న మిస్టరీని ఛేదించేందుకు ఏసీపీ దైవప్రసాద్ నేతృత్వంలోని స్పెషల్ టీమ్ రంగంలోకి దిగింది. శుక్రవారం ఉదయమే కృష్ణ లంకలోని సాయికృష్ణ నివాసానికి చేరుకున్న అధికారులు, కుటుంబసభ్యుల నుంచి సేకరించిన వివరాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఒకవైపు కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు, మరోవైపు పోలీసుల ఇన్వెస్టిగేషన్ మధ్య ఈ కేసులో అనేక మలుపులు తిరుగుతోంది. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చినప్పటి నుంచి స్టేషన్‌లో జరిగిన పరిణామాల వరకు ప్రతి అంశాన్ని దర్యాప్తు బృందం భూతద్దంతో వెతుకుతోంది. ముఖ్యంగా పోలీసులపైనే ఆరోపణలు వస్తుండటంతో సాక్ష్యాల సేకరణలో అధికారులు అత్యంత గోప్యత పాటిస్తున్నారు. ఏసీబీ దైవప్రసాద్ బృందం నేరుగా సాయికృష్ణ ఇంటికి వెళ్లింది. అక్కడ సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి మేనమామ నాగేశ్వరరావు, పిన్ని కనకదుర్గలను సుదీర్ఘంగా విచారించి వారి స్టేట్మెంట్‌లు రికార్డ్ చేశారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు విచరణాధికారులను సైతం విస్మయానికి గురి చేశాయి. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కృష్ణలంక స్టేషన్ లాకప్‌లో ఉంచారని, అక్కడ సీఐ నాగరాజు అతడిని అమానుషంగా చిత్ర వధ చేసి చంపేశారని వారు ఆరోపించారు. కుటుంబ సభ్యుల స్టేట్మెంట్ల అనంతరం దర్యాప్తు టీం కృష్ణ లంక స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ కేవలం మాటలతో కాకుండా డిజిటల్ ఎవిడెన్స్ ఆధారంగా నిజానిజాలు తేల్చాలని నిర్ణయించింది. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ కెమెరాల దృశ్యాలు అత్యంత కీలకం కావడంతో అప్పటికప్పుడు ఫోరెన్సిక్ అండ్ సైబర్ అనాలసిస్ టీమ్ పిలపించారు. వీటిన్నింటినీ అధికారులు సీజ్ చేసి, విశ్లేషణ కోసం నేరుగా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఆ రాత్రి స్టేషన్‌లో ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఈ డిజిటల్ ఆధారాలే ఇప్పుడు కీలకంకానున్నాయి. సాయికృష్ణను మార్కాపురం నుంచి విజయవాడకు ఎప్పుడు తీసుకొచ్చారు? ఈ ఆపరేషన్‌లో ఎవరెవరు పాల్గొన్నవారు? అనే కోణంలో విచారణ సాగుతోంది. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ లతాకుమారితోపాటు మరో ఎనిమిది మంది సిబ్బందిని శుక్రవారం దర్యాప్తు టీం విచారించింది. పెండింగ్‌లో ఉన్న పీడీఓ అమలు చేసేందుకే సాయికృష్ణ కోసం నలుగురు సిబ్బందిని మార్కాపురం పంపినట్టు ఏడీసీపీ వివరించినట్టు సమాచారం. అయితే అతడి తీసుకొచ్చిన తర్వాత ఎవరికి అప్పగించారు.?లాకప్‌లో ఉంచిన సమయం ఎంత? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు వారి స్టేట్మెంట్‌లు రికార్డు చేశారు. కేసు తీవ్రతను దృష్ట్యా, ఈ



అదృశ్యం వ్యవహారంపై విచారణాధికారిగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌ను నియమించారు. ఆయన శుక్రవారం విజయవాడకు చేరుకుని, తొలుత డీజీపీని కలిసి కేసు పురోగతిని వివరించారు. అనంతరం విజయవాడ సీపీ రాజశేఖరబాబును కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరుగా కృష్ణలంక స్టేషన్‌కు వెళ్లిన ఎస్పీ, అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని వ్యక్తిగతంగా ప్రశ్నిస్తూ, ఎక్కడైనా గ్యాప్స్ ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రస్తుతానికి దర్యాప్తు బృందం ఎనిమిది మంది కీలక సిబ్బందిని విచారిస్తోంది. ఇందులో టాస్క్‌ఫోర్స్, కృష్ణలంక స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

### చట్టం ఏం చెప్తోంది? శవం లేకపోతే కేసు నిలవదా?

సినీ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన దృశ్యం' సినిమా కథ అందరికీ గుర్తే. అక్కడ ఒక హత్య జరుగుతుంది, నిందితులు ఎవరో పోలీసులకు స్పష్టంగా తెలుసు. కానీ, బాడీ దొరక్కపోవడంతో హీరో చాకచక్యంగా చట్టం పరిధి నుంచి తప్పించుకుంటాడు. సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు కూడా శవం దొరకకూడదని, హీరో సేఫ్ కావాలని టెన్షన్‌తో కోరుకుంటారు. సరిగ్గా ఇదే తరహా సస్పెన్స్, ఉత్కంఠ ఇప్పుడు విజయవాడ కృష్ణలంకకు చెందిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులోనూ కనిపిస్తోంది. సాయికృష్ణ కనిపించకుండా పోయి నెల రోజులు దాటుతున్నా, అతని ఆచూకీ ఏమైందనే దానిపై అటు పోలీసుల దగ్గర, ఇటు కోర్టుల దగ్గర స్పష్టమైన సమాధానం లేదు. చట్టం ముందు ప్రస్తుతం అతను 'మిస్సింగ్' మాత్రమే.“పోలీసులు అతడిని కస్టడీలోనే చంపేశారు.. బూడిద కూడా లేకుండా కాల్పించేశారు” అంటూ వస్తున్న వార్తలన్నీ ప్రస్తుతం కేవలం రాజకీయ ఆరోపణలు, గాసిప్స్‌గానే ప్రచారంలో ఉన్నాయి. ఒకవేళ లాకప్‌లో ఏదైనా అనూహ్య సంఘటన జరిగి ప్రాణాలు పోయి ఉంటే.. సాధారణంగా పోలీసులు ఆసుపత్రికి తరలించడమో, గుండెపోటు అని కవర్ చేయడమో చేస్తుంటారు. కానీ, ఇక్కడ అసలు ఆనవాళ్లే లేకుండా మాయం చేశారనే ప్రచారం దృశ్యం సినిమాలోని పోలీస్ స్టేషన్ కింద శవాన్ని దాచిపెట్టిన ట్విస్ట్‌ను గుర్తుకు తెస్తోంది. ఈ వ్యవహారంలో పటమట, కృష్ణలంక పోలీస్ సర్కిళ్లలో ఏం జరిగిందో ఎవరికీ తెలియదు, పోలీసులు నోరు విప్పడం లేదు. దీంతో ఈ ఉదంతం ఎప్పటికీ ఛేదించలేని ఒక మిస్టరీగా మిగిలిపోనుందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఈ కేసులో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. తాము సాయికృష్ణను అసలు అదుపులోకే తీసుకోలేదని పోలీసులు కోర్టుకు గట్టిగా చెప్పలేకపోతున్నారు. సాయికృష్ణతో పాటు మార్కాపురంలో పట్టుబడిన మిగిలిన వారిని పోలీసులు విచారించి అప్పట్లోనే వదిలేశారు. వారితో పాటే సాయికృష్ణను కూడా మేము వదిలేశాం, ఆ తర్వాత అతను ఎక్కడికి వెళ్ళాడో మాకు తెలియదు అని చెప్పుకునే లూప్‌హోల్ పోలీసులకు ఉంది. కానీ, తమకు అసలు సంబంధమే లేదని పూర్తిగా తిరస్కరించకుండా, విచారణకు సమయం కోరడమే ఇక్కడ కథను మలుపు తిప్పుతోంది. సాయికృష్ణ ఆనవాళ్లు దొరక్కపోతే, తాము స్టేషన్ నుంచి పంపించేసిన తర్వాతే అతను అదృశ్యమయ్యాడనే వాదనను పోలీసులు తెరపైకి తెచ్చే అవకాశం లేకపోలేదు.దృశ్యం సినిమాలో లాగా శవం దొరక్కపోతే పోలీసులు చట్టపరంగా సేఫ్ అయినట్లేనా అంటే.. న్యాయశాస్త్రం ప్రకారం అలా అనుకుంటే పొరపాటే. కార్పస్ డెలెక్టి సూత్రం ప్రకారం సాధారణంగా నేరాన్ని నిరూపించడానికి భౌతిక ఆధారాలు అవసరమే అయినప్పటికీ.. సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో స్పష్టం చేసినట్లు పరిస్థితుల ప్రభావం బలంగా ఉండి, నిందితుడు చివరిసారిగా ఎవరి ఆధీనంలో ఉన్నాడో రుజువైతే శవం లేకపోయినా శిక్ష ఖరారు చేయవచ్చు.” సాయికృష్ణను పోలీసులు తీసుకెళ్లినట్లు సాక్ష్యాలు ఉన్నాయి కాబట్టి, ఆ తర్వాత అతను ఏమయ్యాడో నిరూపించాల్సిన పూర్తి బాధ్యత సెక్షన్ 106 ప్రకారం పోలీసుల పైనే ఉంటుంది. హైకోర్టు విధించిన గడువు లోగా ఆనవాళ్లు దొరక్కపోతే.. ఈ దృశ్యం' తరహా కథ క్లైమాక్స్ పోలీసులకు చుట్టుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# అమ్మగా.. క్రికెటర్‌గా.. రెండింటినీ బ్యాలెన్స్ చేసేలా ఐసీసీ కొత్త పాలసీ




**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళా క్రికెటర్ల కెరీర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లేలా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఒక మైండ్ బ్లోయింగ్ ప్లాన్ వేసింది. డెలీవరి తర్వాత మహిళా క్రికెటర్లు మళ్లీ మైదానంలోకి రీ-ఎంట్రీ ఇచ్చేందుకు వీలుగా రిటర్న్ టు ప్లే పోస్ట్-ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్ ను లాంచ్ చేసింది. మాతృత్వం, క్రికెట్ అనేవి వేర్వేరు కాదు.. రెండూ కలిసే కొనసాగవచ్చు అనే మెసేజ్‌తో ఈ సరికొత్త రూల్స్ తీసుకొచ్చింది. మహిళా క్రికెట్ ప్రొఫెషనల్‌గా మారుతుండటంతో.. వారి సంక్షేమాన్ని, ఆటను బ్యాలెన్స్ చేయడానికి ఐసీసీ ఈ స్టెప్ వేసింది. గర్భధారణకు సంబంధించిన నిర్ణయాలు పూర్తిగా ప్లేయర్ల వ్యక్తిగతం, క్రికెట్ బోర్డులు ఎలాంటి ప్రెగ్నెన్సీ టెస్టులు తప్పనిసరి చేయొద్దని ఐసీసీ క్లియర్‌గా చెప్పింది. మహిళా క్రికెటర్లు ప్రసవం తర్వాత గ్రౌండ్‌లోకి అడుగు పెట్టేందుకు ఐసీసీ అద్భుతమైన 6 =ం ఫ్రేమ్‌వర్క్‌ను సెట్ చేసింది. ప్రసవం జరిగిన మొదటి 6 వారాల్లో రెడీ దశతో మొదలు పెట్టి తేలికపాటి కదలికలు, సైకలాజికల్ సపోర్ట్ అందిస్తారు. ఆ తర్వాత 6-8 వారాల్లో రివ్యూ దశలో మెడికల్ స్పెషలిస్టు వారి రికవరీని అసెస్ చేస్తారు. 8-16 వారాల్లో రీస్టోర్ ద్వారా రన్నింగ్, స్ట్రెంత్ ట్రైనింగ్ ప్రారంభిస్తారు. ఆ తర్వాత రీకండిషన్ దశలో గాయాల బారిన పడకుండా బాడీని రీబిల్డ్ చేస్తారు. చివరిగా రిటర్న్, రిఫైన్ దశల ద్వారా ప్లేయర్లు మళ్లీ కాంపిటేటివ్ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు.

**బేబీ కేర్‌తో ట్రావెల్:**
కేవలం ఫిజికల్ రికవరీ మాత్రమే కాదు, ప్రాక్టికల్ సపోర్ట్ సిస్టమ్స్ కోసం ఐసీసీ అదిరిపోయే ఆఫర్స్ తీసుకొచ్చింది. ప్లేయర్లకు ఫ్లెక్సిబుల్ ట్రైనింగ్ ఎన్విరాన్‌మెంట్, చైల్డ్ కేర్, బ్రెస్ట్ ఫీడింగ్ సౌకర్యాలతో పాటు విదేశీ టూర్ల సమయంలో కేర్‌టేకర్‌ను కూడా తమతో పాటు తీసుకెళ్లే క్రేజీ ఆప్షన్ ఇచ్చింది. గర్భధారణ సమయంలో ఆడలేని ప్లేయర్లకు కోచింగ్ లేదా అనలిస్ట్ లాంటి ఆల్టర్నేటివ్ రోల్స్ ఇవ్వాలని, అలాగే రికవరీ పీరియడ్‌లో కాంట్రాక్ట్ ఎక్స్‌టెన్షన్స్ కూడా పరిశీలించాలని ఆయా బోర్డులకు ఐసీసీ సూచించింది. ఈ సమయంలో ప్లేయర్లు ఒంటరిగా ఫీల్ అవ్వకుండా మెడికల్, కోచింగ్ స్టాఫ్‌తో రెగ్యులర్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలని తెలిపింది.

**మైదానంలో రచ్చ లేపిన సూపర్ మామ్స్:**
ఇప్పటికే ఎంతో మంది మహిళా క్రికెటర్లు అమ్మలుగా ప్రమోషన్ పొందాక కూడా ఇంటర్నేషనల్ క్రికెట్‌లో సత్తా చాటి హిస్టరీ క్రియేట్ చేశారు. పాకిస్తాన్ స్టార్ బిస్మా మారూఫ్ ప్రెగ్నెన్సీ బ్రేక్ తర్వాత 2022లో తిరిగొచ్చి ఉమెన్స్ వరల్డ్ కప్‌లో కెప్టెన్‌గా చెలరేగిపోయింది. న్యూజిలాండ్‌కు చెందిన అమీ సాటర్త్‌వైట్ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత రీ-ఎంట్రీ

ఇచ్చి ఎంతోమంది తల్లులకు స్ఫూర్తిగా నిలిచింది. ఆస్ట్రేలియాకు చెందిన సారా ఇలియట్ తల్లయ్యాక కూడా యాషెస్ సిరీస్‌లో సెంచరీతో చెలరేగింది. ఇంగ్లాండ్ లెజెండ్ ఎనిడ్ బేక్‌వెల్ మాతృత్వం తర్వాత ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఎంట్రీ ఇవ్వగా.. వెస్టిండీస్ ప్లేయర్ ఆఫీ ఫ్లెచర్ వికెట్ తీసిన ప్రతిసారీ తన కొడుకు కోసం స్పెషల్ సెలబ్రేషన్స్ చేసేది.. మన ఇండియా నుంచి స్నేహ దీప్తి, కువైట్ నుంచి మరియం ఒమర్ కూడా తల్లైన తర్వాత గ్రౌండ్‌లోకి అడుగుపెట్టి సత్తా చాటారు. మహిళా క్రికెటర్ల కెరీర్‌ను మరింత సస్టైనబుల్‌గా మార్చడంలో ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయం నిజంగా గేమ్ ఛేంజర్.

# 12 ఓవర్లకి 12 పాయింట్లు కట్.. ఇంగ్లాండ్‌కు గట్టి షాక్ ఇచ్చిన ఐసీసీ

**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ జట్టుకు ఒకేసారి రెండు షాక్స్ తగిలాయి. ఒకవైపు రెండో టెస్టులో కివీస్ చేతిలో 253 రన్స్ తేడాతో ఘోర పరాజయం చవిచూడగా, మరోవైపు స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ ఆ జట్టుకు భారీ పెనాల్టీ విధించింది. ఈ పరిణామాలతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరాలనే ఇంగ్లాండ్ ఆశలు మరింత సంక్లిష్టంగా మారాయి. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పట్టికలో ఇంగ్లాండ్ ఏడో స్థానంలో నిలిచింది.

**12 ఓవర్లు లేట్.. 12 పాయింట్లు కట్:**
ఆదివారం ముగిసిన రెండో టెస్టులో ఇంగ్లాండ్ ఓడిపోవడంతో డబ్ల్యూటీసీ పట్టికలో ఆ జట్టు పర్సంటేజీ 34.72 శాతం నుంచి ఒక్కసారిగా 26.38 శాతానికి పడిపోయింది. ఈ టెస్టు మ్యాచ్‌కు ముందు ఇంగ్లాండ్ ఖాతాలో 50 పాయింట్లు ఉన్నాయి. అయితే ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ నిర్ణీత సమయం కంటే ఏకంగా 12 ఓవర్లను ఆలస్యంగా వేయడంతో 12 పాయింట్లను కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఇంగ్లాండ్ పాయింట్ల సంఖ్య 38కి పడిపోయింది.

**ఇంగ్లాండ్ జట్టుకు మ్యాచ్ ఫీజులో 50 శాతం ఫైన్:**
రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అందుబాటులో లేకపోవడంతో ఈ మ్యాచ్‌కు జో రూట్ తాత్కాలిక సారథిగా కొనసాగారు. స్లో ఓవర్ రేట్ కారణంగా కేవలం పాయింట్ల కోత మాత్రమే కాకుండా, కెప్టెన్‌గా వ్యవహరించిన జో రూట్‌తో పాటు జట్టులోని సహచరులందరికీ ఐసీసీ 50 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా విధించింది.




**కెప్టెన్ బెన్ స్టోక్స్ రీ-ఎంట్రీ:**
ఇంగ్లాండ్ ఫ్యాన్స్‌కు ఒక గుడ్ న్యూస్.. బాక్సర్‌తో గొడవ కారణంగా రెండో టెస్టుకు దూరమైన రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ మళ్లీ తుది జట్టులోకి రాబోతున్నాడు. న్యూజిలాండ్‌తో జరగబోయే మూడో టెస్టు కోసం ప్రకటించిన స్క్వాడ్‌లో అతనికి చోటు లభించింది. కెప్టెన్ తిరిగి రావడంతో ఇప్పుడు తుది జట్టు నుంచి ఎవరిని పక్కన పెడతారనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉండటంతో, సిరీస్ విజేతను తేల్చే మూడో టెస్టు జూన్ 25 నుంచి నాటింగ్‌హామ్ వేదికగా స్టార్ట్ కానుంది.

# ఐపీఎల్‌లో మరో బిగ్ ట్రేడ్: హార్దిక్ కోసం రాజస్థాన్ ప్రయత్నం.. ఆ స్టార్ ప్లేయర్‌ని ఇవ్వమన్న ముంబై!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌కు వచ్చి జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా, ఇప్పుడు ఆ జట్టును వీడేందుకు సిద్ధమయ్యాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్ల మధ్య వచ్చిన విభేదాల వల్లే హార్దిక్ ముంబై ఫ్రాంచైజీని వదిలి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది.




**రాజస్థాన్ నుంచి ముంబైకి రానున్న డాషింగ్ ఓపెనర్:**
రెవ్‌స్పోర్ట్జ్ నివేదిక ప్రకారం.. హార్దిక్ పాండ్యాను ట్రేడ్ చేసుకోవడానికి రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ రేసులో ముందుంది. ఈ డీల్‌లో భాగంగా రాజస్థాన్ తమ స్టార్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను ముంబై ఇండియన్స్‌కు అప్పగించనుండగా, హార్దిక్ పాండ్యా ఆర్ఆర్ గూటికి చేరనున్నాడు. ముంబై రంజీ జట్టుకు ఆడే జైస్వాల్‌కు, ఎంఐ ఫ్రాంచైజీలోకి రావడం ఒక పర్ఫెక్ట్ హోమ్‌కమింగ్ లాంటిదని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**అందుకే ముంబై వైపు జైస్వాల్ చూపు:**
గత ఏడాది కాలంగా యశస్వి జైస్వాల్ భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు కొనసాగుతున్నాయి. సంజు శాంసన్ రాజస్థాన్ రాయల్స్ నుంచి నిష్క్రమించిన తర్వాత జైస్వాల్ ఆ జట్టుకు బిగ్గెస్ట్ స్టార్ అవుతాడని, అలాగే కెప్టెన్సీ రేసులోనూ అతనే ముందుంటాడని అందరూ అనుకున్నారు. కానీ రాజస్థాన్ మేనేజ్‌మెంట్ జైస్వాల్‌ను కాదని రియాన్ పరాగ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. అంతేకాదు, బ్యాటింగ్ విభాగంలో 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ అదిరిపోయే పర్ఫామెన్స్‌తో మోస్ట్ ఎక్సైటింగ్ టాలెంట్‌గా ఎదిగాడు. దీంతో తన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లో పెట్టడానికి రాజస్థాన్ నుంచి బయటకు రావడమే జైస్వాల్‌కు ఉత్తమమైన ఆప్షన్ అని భావించాడు.

**ముంబైలో సీనియర్ల ప్రక్షాళన:**
ముంబై ఇండియన్స్ కేవలం హార్దిక్ పాండ్యానే కాదు, జట్టులోని వయసు పైబడుతున్న సీనియర్ స్టార్లను వదిలించుకోవాలని చూస్తోంది. ఈ క్రమంలోనే టీ20 స్పెషలిస్ట్ సూర్యకుమార్ యాదవ్ కూడా కొత్త టీమ్ కోసం చూస్తున్నట్లు టాక్. ఉత్తరాదికి చెందిన రెండు ఫ్రాంచైజీలు సూర్యకు కెప్టెన్సీ ఆఫర్ ఇస్తూ తమ జట్టులోకి లాగేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి.

# తానొకటి తలచిన.. అన్‌లక్కీ తెలుగమ్మాయ్ తెరవెనక కథ!

పెళ్లి చూపులు- లాంటి క్లాసిక్ బ్లాక్‌బస్టర్ తో సోలో హీరోయిన్‌గా కెరీర్‌ను టేకాఫ్ చేసుకుంది తెలుగమ్మాయి రీతూ వర్మ. అంతకుముందు కొన్నేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా -పెళ్లి చూపులు- తెచ్చిన గుర్తింపే వేరు! ఓవర్ నైట్ స్టార్ డమ్ పెంచిన చిత్రమిది. ఆ తర్వాత దుల్కర్ సల్మాన్, చియాన్ విక్రమ్, గోపీచంద్ లాంటి క్రేజీ ..అగ్ర హీరోల సరసన వరుసగా అవకాశాలను అందుకుంది. అయితే గ్లామర్ పరిశ్రమలో ప్రతిభ ఎంత ఉన్నా.. అదృష్టం కూడా కలిసిరావాలనే దానికి రీతూ వర్మ కెరీర్ ఒక ఉదాహరణ. నటిగా ఎదిగే క్రమంలో.. కమర్షియల్ సినిమాలతో సత్తా చాటుతూ దూసుకెళ్లాల్సిన సమయంలో తన కెరీర్ గురించి ఎంత పెద్దగా ఊహించుకుందో.. అందుకు అతీతంగా దురదృష్టవశాత్తూ కొన్ని దెబ్బలు పడ్డాయి.



బ్రౌన్ రంగులో చేతనా పాండే ఆకర్షణీయమైన 'చాక్లెట్ గ్లామ్' లుక్

ముఖ్యంగా కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ - స్టార్ డైరెక్టర్ గౌతమ్ మీనన్ కాంబినేషన్‌లో వచ్చిన -ధృవనక్షత్రం- తన కెరీర్ గేమ్ ఛేంజ్ చేస్తుందని ఆశించింది. కానీ అలాంటి అత్యంత ప్రతిష్టాత్మక చిత్రంలో హీరోయిన్‌గా అవకాశం దక్కినా అది కలిసి రాలేదు. తన కెరీర్‌ను అంతర్జాతీయ స్థాయికి రీడిఫైన్ చేసేంత గొప్ప ప్రతిభావంతులతో పనిచేసే ఛాన్స్ వచ్చినా దురదృష్టవశాత్తూ ఆ సినిమా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడటం, రిలీజ్ ఏళ్ల తరబడి ఆలస్యం అవ్వడం ఈ తెలుగమ్మాయిని వేధించింది. ఇంతటి క్రేజీ సినిమాలో భాగమయ్యాక కూడా అది ప్రేక్షకులకు దూరం అవ్వడాన్ని రీతూ జీర్ణించుకోలేని దుస్థితి ఏర్పడింది.

అయినా.. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా రీతూ వర్మ మొక్కవోని దీక్షతో తన పంథాలో ముందుకు సాగుతోంది. నటిగా కెరీర్ పరంగా గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా వైవిధ్యమైన సినిమాలను ఎంచుకుంటోంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ సరసన భారీ బడ్జెట్‌తో పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న -భరతవర్ష- సాగా ఆఫ్ షులా- అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాపై రీతూ వర్మ చాలా హోప్స్ పెట్టుకుంది. కెరీర్‌లో తప్పనిసరిగా ఒక భారీ హిట్ పడాల్సిన అత్యంత కీలకమైన సమయంలో ఈ హిస్టారికల్ డ్రామాలో భాగం కావడం విశేషం.

జాతీయ అవార్డు గ్రహీత, వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు సంకల్ప్ రెడ్డి తెరకెక్కిస్తున్న -భరతవర్ష- సాగా ఆఫ్ షులా- సినిమా కథాంశం భారతదేశ ప్రాచీన కాలం, చారిత్రక యుద్ధాల నేపథ్యంతో ముడిపడినది. కమర్షియల్ హంగులతో పాటు అద్భుతమైన విజువల్స్, అప్పటి సంస్కృతీ సంప్రదాయాల నేపథ్యంలో ఒక యోధుడి కథగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమా గోపీచంద్ కెరీర్‌కు పూర్తి వైవిధ్యమైనది.. ఎందుకంటే అతడు తన రెగ్యులర్ మాస్ ఇమేజ్‌ను పక్కనబెట్టి రాజుల కాలం నాటి ఒక సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నారు. అటు సంకల్ప్ మార్క్ మేకింగ్, ఇటు గోపీచంద్ యాక్షన్ ఎలిమెంట్స్ ఈ సినిమాను ఇద్దరి కెరీర్‌కు ఎంతో ప్రత్యేకంగా మార్చబోతున్నాయి.ఈ చారిత్రక కథాంశంలో నటిగా తనను తాను నిరూపించుకోవడానికి రీతూ వర్మకు చాలా ఎక్కువ స్కోప్ ఉంది. కేవలం ఒక సాదాసీదా హీరోయిన్ పాత్రలా కాకుండా... కథను మలుపు తిప్పే బలమైన, రాచరికపు లేదా చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాత్రలో తను కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. సంకల్ప్ రెడ్డి సినిమాల్లో మహిళా పాత్రలకు మంచి ప్రాధాన్యత ఉంటుంది కాబట్టి... రీతూ వర్మ తన నటనతో మరోసారి మెప్పించే వీలుంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తే అన్‌లక్కీ హీరోయిన్ అనే ముద్రను చెరిపేసి రీతూ వర్మ దక్షిణాదిన మళ్లీ ఒక రేంజ్‌లో బిజీ అవ్వడం ఖాయం.



బీచ్ ఒడ్డున వర్షిణి సౌందరరాజన్ సహజమైన ఆకర్షణతో మెరిసిపోతున్నారు

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965